శ్రీః

శివలీలావిలాసము

కూచిమంచి తిమ్మకవికృతము.

చెన్నపురి :

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే

ప్రకటితము.

1930.

PRINTED BY

V. RAMASWAMY SASTRULU & SONS

AT THE 'VAVILLA' PRESS

MADRAS.—1930

శ్రీ ర స్తు.

శివలీలావిలాసము

ప్రథమాశ్వాసము.

ఇష్టదేవతాప్రార్థనము.

శ్రీనగజాఘనస్తనవి
సృత్వరసంకుమదైణనాభిపం
కానిశవాసితస్ఫుటభు
జాంతరుఁ డిందుసుధాపయస్సదృ
గ్భ్యానుతకీర్తిపీఠపుర
కుక్కుటలింగమహాప్రభుం డశే
షానతభక్తపాలనప
రాయణుఁ డీవుత మా కభీష్టముల్. 1

క. మగనిసగమేన నెలకొని
ముగురంబలయందు నాదిమూలం బగుచున్
జగ మేలుసర్వమంగళ
జగమే లిడుఁగాత మాకు సమ్యక్కరుణన్. 2

ఉ. శ్రీరమణీరమేశ్వరులఁ జిత్తమునం గదియించి భారతీ
సారసగర్భుల న్నిగుల సంస్తుతిఁ జేసి మతంగజాననున్

సారెకుఁ గొల్చి దెందులురిసత్కులపావను లింగనార్యు ని
పారఁ దలంచి మున్నిటిమహాకవుల న్భజియించి వేడుకన్.

—— కవివంశాభివర్ణనము. ——

సీ. కౌండిన్యగోత్రవిఖ్యాతుండఁ గూచిమం
చ్యన్వయాంభోధినీహారకరుఁడ
గంగనమంత్రిశేఖరునకు నంగనా
మణి యగులచ్చమాంబకును సుతుఁడ
బహుకార్యనిర్వాణబంధురప్రతిభుండఁ
గుక్కుటేశ్వరకృపాకూరలబ్ధ
సత్కవితామహాసామ్రాజ్యభారధౌ
రేయుఁడ బుధజనప్రియచరితుఁడ

తే. దెందులురిలింగనారాధ్యదేశికేంద్ర
దత్తమాహేశ్వరాచార్యవృత్తిరతుఁడఁ
గందరాడఘనగ్రామమందిరుండఁ
దిమ్మకవిచంద్రుఁ డనుజగద్వినుతయశుఁడ.

సీ. ప్రౌఢి మై రుక్మిణీపరిణయంబును సింహ
శైలమాహాత్మ్యంబు నీలపెండ్లి
కథయును రాజశేఖరవిలాసంబును
నచ్చతెనుంగు రామాయణంబు
సారంగధరనరేశ్వరచరిత్రంబు స
ర్పాద్రివసంగమాహాత్మ్యకంబు
రసికజనమనోభిరామంబు లక్షణ
సారసంగ్రహము సర్వపురస

తే. మంచితక్షేత్రకథనంబు మఱియుఁ బెక్కు
శతకదండకసత్కృతుల్ ప్రతిభఁ గూర్చి
యుల్ల మలరారఁ బార్వతీవల్లభునకు
భక్తి నర్పణఁ జేసినభవ్యమతిని. 5

వ. ఇట్టినేను మదభీష్టదైవతం బైనకుక్కుటేశ్వరశ్రీమన్మహాదేవు
నకు నంకితంబుగా మఱియు నొక్కప్రబంధంబు రచింపం
దొడంగి, 6

షష్ఠ్యంతములు.

క. సర్గాపసర్గఫలదని
సర్గునకుఁ భర్గునకుఁ బ్రశమితమహాంహో
వర్గునకు సూరినుతస
న్మార్గునకు మనోజ్ఞ సాను మద్దుర్గునకున్. 7

క. అంభోజాసనమదసం
స్తంభునకుఁ శంభునకు నుదంచితకరుణా
రంభున కఖిలావనసం
రంభునకుఁ ముదితమౌనిరాడ్డింభునకున్. 8

క. సర్వసుపర్వకదంబక
పూర్వునకుఁ శర్వునకును భుజబలలీలా
ఖర్వునకు శమితయమరా
డ్గర్వునకు మహోక్షరాజగంధర్వునకున్. 9

క. బాణాదిభక్తజనసం
త్రాణునకుఁ స్థాణునకు నుదంచదుదన్వ
త్తూణునకు సరసిజేక్షణ
బాణునకుఁ సత్యవాక్యపరిమాణునకున్. 10

క. సామజదానవదర్పవి
రామునకున్ సోమునకును రజతమహీభృ
ద్ధామునకుఁ గోటిదినకర
ధామునకు మహోగ్రసమరతలభీమునకున్. 11

క. పురదైతేయస్మరసం
హరునకు హరునకు నిరంతరాత్యంతదయా
పరునకుఁ బీఠాపురమం
దిరునకు శ్రీకుక్కుటేశదేవవరునకున్. 12

వ. సమర్పణంబుగా నారచియింపం బూనినశివలీలావిలాసం బనుశృంగారరసప్రబంధంబునకుం గథావిధానం బెట్టిదనిన.

కథాప్రారంభము.

తే. హస్తిపురమున నొక్కనాఁ డర్జునుండు
భీష్ముఁ గన్గొని మ్రొక్కి సంప్రీతిఁ బలికెఁ
దాత నిన్నొక్కపుణ్యకథాప్రసంగ
మడుగఁ గోరెదఁ గృపతోడ నాన తిమ్ము. 14

క. నీ వెఱుఁగనిపుణ్యకథల్
క్ష్మావలయమునందు లేవుగద యేవైనన్
భావింపఁగ నఖిలజగ
త్పావని యగుగంగమహిమఁ బ్రతిభం జెపుమా. 15

ఆ. శివుఁడు గంగ నేల శిరమున నిడుకొనె
గంగ విష్ణుపాదకమలమున జ
నించు టెట్లు తాత నిక్కంబుగా నిది
తేఁటపడఁగ నాకుఁ దెలుపవలయు. 16

వ. అదియునుం గాక, 17

తే. గంగఁ గొందఱు జాలరికన్నె యనుచు
నెన్నుచుండుదు రమ్మాట యేర్పడంగ
వినఁ దలంచెద నమ్మహావేణి కీవు
కూర్మిపట్టివిగద లసద్గుణకలాప. 18

తే. అనిన గాంగేయుఁ డప్పాండుతనయుఁ బలికె
వత్స నే మున్ను నారదువలన విన్న
తెఱఁగు నీకిప్పుఁ డెలమితో నెఱుఁగఁ జేతు
నింపు దైవార విను మని యిట్టు లనియె. 19

ఆ. మొదలఁ గమలగర్భుఁ డుదకంబుల సృజించి
వీర్య మందులోన విడిచె నది స
హస్రకరనిభప్రభాంచిత మై హిర
ణ్యస్వరూప మైనయండ మయ్యె. 20

వ. అయ్యండంబునందుఁ జరాచరాత్మకం బైనసకలప్రపంచంబు
సృజియించి వృద్ధిఁ బొందింపుచుండె నంత. 21

తే. మూషకాసురుఁ డనుసురద్వేషి యొకఁడు
దూఱి యయ్యండమున కొకతూటువొడిచె
నందువలన మహోదకం బద్భుతంబు
మీఱఁ బెనువెల్లియై చొచ్చి పాఱుచుండె. 22

క. ఆవెల్లి జగము లన్నియు
వేవేగ న్ముంచి జంతువితతికి నెల్లన్
వావిరి నుపద్రవంబుం
గావింపుచు నున్న నీలకంఠుఁడు పేర్మిన్. 23

తే. జగదుపద్రవశాంతికై తగిలి మున్ను
కాలకూటంబుఁ గంఠభాగమున నిడ్డ

చందమున నమ్మహాంబునిర్ఝరము నెలమిఁ
దనజటాజూటవీథి నందముగఁ దాల్చె. 24

తే. అపుడు గంగమహేశుజటాగ్రవీథిఁ
బట్టఁజాలక యుప్పొంగి పైకిఁ బొరలి
ఘనతరంగిణి యై దూఱి కమలజాండ
వివరమునఁ బాఱె జగదుపద్రవము గాఁగ. 25

తే. హరియు నయ్యెడ మూషకాసురు వధించి
తనపదాంగుష్ఠ మబ్బిలద్వారసరణి
నునిచి నీ రాఁచె సందుననుండి యూఁట
యించు కాలోపలికిఁ బ్రవహింపుచుండె. 26

వ. ఆప్రవాహంబు సకలభువనంబులఁ బవిత్రంబుగా గంగాభ
వాని యేకార్ణవంబుగ జగంబు లన్నియు ముంచి లోజంతు
కోటిజలచరంబులక్రియ మించి చెలంగి పొంగి. 27

క. తనకెదు రెవ్వరు లే రని
మునుకొని గర్వాతిరేకమునఁ బలికిన న
వ్వనితారత్నముఁ గనుఁగొని
కినుక మదిం బెనఁగొనంగఁ గిరిశుఁడు వలికెన్. 28

తే. ఆఁడుదానవు నీ కిట్టు లబ్బురంపు
గర్వ మేటికి నాచేతఁ గమలసంభ
వాదులును మున్ను గర్వించి యడఁగి చనిరి
గర్వ మెంతటివారికిఁ గాదు సుమ్ము. 29

క. భూచక్రంబున కిప్పుడె
వే చని నీ వందు మత్స్యవిక్రయవృత్తిఁ

ప్రాచుర్యంబుగ మనియెడు
నీచకులంబున జనించి నిలువుము చెలియా. 30

తే. అనిన నళుకొంది గంగ యోయనఘచరిత
తప్పు సేసితి లోఁగి నీదయ దలిర్పఁ
గాచి రక్షించు నన్నెదఁ గాఁక యుండఁగ
నిన్ను నెడఁబాసి క్షణమైన నిలువఁజాల. 31

క. నావుడు శంకరుఁ డిట్లను
నీ వటువలెఁ గొన్నినాళ్లు నిలిచినపిదపన్
దేవత లెన్నఁగ నిన్నున్
దేవేరిగఁ బెండ్లియాడి తెచ్చెద మరలన్. 32

వ. అని పరమేశ్వరుం డానతిచ్చిన నట్లనె గంగాభవాని దాస
కులకన్యాస్వరూపంబు ధరియించి భూలోకంబునకు వచ్చి
పారావారతీరంబున మహేశ్వరుం గురించి తపం బాచరిం
పుచుండె నంత. 33

సీ. శంఖదేవుం డనుజాలరి గేస్తుండు
దనబంధువుల దానుఁ దవిలి యొక్క
నాఁడు దా నేలూరినగరంబునందుండి
జలధికి వేఁటాడఁ జని యొకయెడఁ
దపముసేయుచు నున్నతరళాయతేక్షణఁ
జిన్నికన్నియఁ జూచి చేరఁబోయి
తల్లి నీ వెవ్వరిదానవు కుల మెద్ది
తలిదండ్రు లెవ్వారు కులము పేరు

తే. నెద్ది తప మేలచేసెద విచట నిట్లు
సరసిజానన నాకు నీచంద మెల్ల:

దెలియఁజెప్పు మటన్న నక్కలికిమిన్న
యింపు దళుకొత్త నతనికి నిట్లు లనియె. 34

తే. తండ్రి విను మేను గంగను దక్షహరుఁడు
నన్ను నొకకారణమున డెందంబులోన
నలిగి జాలారికన్నియ వై జనించు
మని శపించిన వచ్చి యిట్లైతి జుమ్ము. 35

తే. తల్లి యైనను విను మఱిఁ దండ్రి వైన
నీవె కా నింక నన్యుల నే నెఱుంగ
నెవ్విధంబున సాఁకెదొ హితముతోడ
ననిన ముద మంది యతఁడిట్టు లనుచుఁ బలికె 36

తే. అమ్మ నీ వేమిగోరిన నట్ల సేతుఁ
గలవు మాయింట సకలభాగ్యంబు లిపుడు
రమ్ము నాతోడ మాభవనమ్మునకును
జీవనప్రాయముగఁ జూతుఁ జెలియ నిన్ను. 37

క. రావమ్మ భువనపావని
రావే నాముద్దుబిడ్డ రావె లతాంగీ
రావే శుభఫలదాయిని
రావే జగదంబ యిపుడె రా నాతోడన్. 38

వ. అని యపుత్రకుండు గావునఁ బెన్నిధానంబు గన్నపేదచందంబున దైవంబునాకిప్పు డిబ్బాలారత్నంబు నొసంగె నని పొంగి దానిం దోడ్కొని నిజగృహంబున కరిగి తనభార్య యగుచక్రమదేవి కప్పాప నొసంగిన నవ్వధూరత్నంబు. 39

ఆ. పెరుఁగుఁ బాలు జున్నుఁ బెల్లంబు నెయ్యి కొ
బ్బరి యనంటిపండ్లు పనసపండ్లు

పిండివంట లిక్షుఖండంబు లో రెంబు
ప్రీతి యొసఁగ నొసఁగి పెనుచుచుండె 40

వ. అట్లు పెనుచుచున్నయెడ. 41

ఉ. అంగదముద్రికావలయహారలలాటిక లెమ్మెనెమ్మెయి
వ్రంగులుగుల్కఁగ్రొందగటునాడెపుఁబావడసొంపు నింపమే
ల్బంగరుగిల్కుటందియలు బాళిగ నంఘ్రుల ఘల్లుఘల్లనన్
గంగ యనుంగులం గలసి కౌతుకలీలలఁ గ్రీడసేయుచున్.

సీ. బొమ్మ పెండ్లిండ్లు సొంపుగఁ జేసి గుజ్జన
గూటియామెత లనుంగులకుఁ బెట్టు
బలితంపుటపరంజిపంజరంబుల నిడి
చిలుకబోంట్లకు మేఁత లెలమి నొసఁగు
నాడెంపునెలతాలమేడలపై నిల్చి
లీల మై తూఁగుటుయ్యాల నూఁగుఁ
బరువంపు నెత్తావిపిరిబొండుమల్లెకుం
జాదుల నీరెత్తి ప్రోదిసేయు

తే. బోటులను గూడి కిన్నెరమీటు నింపు
నాటుకొలుపుచు జిలిబిలిపాట పాడు
హాళి దై వారఁ జెంగల్వకేళికుళుల
నోలలాడు జెలంగి యవ్వాలుగంటి. 43

వ. అట్లు గ్రీడింపుచు దినదినప్రవర్ధమాన యగుచున్నంత. 44

సీ. నిద్ధంపుసోగ పెన్నెరులు వేనలికందె
నెదఁ జిన్నిచన్నులు కుదురులెత్తెఁ
గనుదోయి నరసిగ్గుకలికిచూపు లెసంగె
నూనూఁగునూఁగారు గానవయ్యెఁ

దావిమోవికిఁ గ్రొత్తతలిరుడాలు ఘటిల్లె
జిలిబిలిపలుకుల మొలచె దీప్తి
నెమ్మొగంబున వింత నిగనిగ జిగిపాల్చెఁ
జిన్నారినగవులు చెంగలించె

తే. నడలఁగడ లేనిమురిపెంబు గడలుకొనియె
మెఱుఁగుచెక్కులతళతళల్ దుఱఁగలించెఁ
గటిభరంబించుకించుక ఘనతఁ దాల్చెఁ
జెలికి లేజవ్వనము మేన మొలుచుటయును. 45

వ. అట్టి నవయౌవనారంభంబునఁ జీనిచీనాంబరానర్ఘమణివిభూషణ సుగంధతాంబూలాదికంబులం దేజరిల్లుచుండె నంత.

సీ. సిరులకు మన్కి యై చిరసుఖాకర మైన
కైలాస శైల శృంగంబునందు
మహనీయతపనీయమయసముద్దీప్తి ని
శాకాంతమాణిక్యసౌధవీథి
నలువయు వెన్నుండు బలరిపుప్రముఖ ది
క్పతులును సనకాదియతివరులును
నందీశగుహగజాననభృంగిరిటవీర
భద్రభైరవముఖప్రమథపతులు

తే. దవిలి కొలువంగ గిరిరాజతనయఁ గూడి
యనుపమానర్ఘరత్నసింహాసనమున
నక్కజం బగుఠీవి మై నొక్కనాఁడు
హాళిఁ గొలువుండె రాజరేఖార్ధమౌళి. 47

వ. అయ్యవసరంబున. 48

సీ. మినువాఁక తెలినీరు నినిచినకుండికఁ
బసిఁడిచాయలఁ గేరుపల్లజడలు
వెన్నెలనిగ్గును వెదఁజల్లునెమ్మేను
చక్కనిస్ఫటికంపుజపసరంబు
గాలిసోఁకిన మ్రోయుకడిఁదికిన్నెరవీణె
యభినవమృదులకృష్ణాజినంబు
దట్టంపుగోపిచందనపుండ్రవల్లికల్
పసమించుకాషాయవసనములును
తే. గలిగి భవభర్గ చంద్రశేఖర మహేశ
హర మహాదేవ సాంబ శంకర గిరీశ
యనుచు వేడుక నచ్చోటి కరుగుదెంచె
సారవిద్యావిదుండైననారదుండు. 49
తే. అట్లరుగుదెంచి దివిజసంయమి వరుండు
భక్తి దైవార నమ్మహాప్రభునినగరు
సొచ్చి హెచ్చినవేడుక లచ్చుపడఁగఁ
గేలుగవమోడ్చి యద్దేవిమ్రోల నిలిచి. 50
సీ. రాకేందునీకాశరమ్యగాత్రమువాని
రమణీయఫణిభూషణములవాని:
గందర్పశతకోటిసుందరాకృతివాని
డమరుత్రిశూలఖడ్గములవాని
సదమలదరహాససరసాననమువాని
భసితాంగరాగవిభ్రమమువాని
సింధురాజినసమంచితనిచోళమువానిఁ
గరుణాకటాక్షవీక్షణమువానిఁ

తే. బ్రథితభువనోద్భుతోరువై భవమువాని
ఘనతరానందహృదయపంకజమువాని
సకలలోకాధిపతి యైనసాంబశివునిఁ
గనియె మునిమాళి కన్నులకఱవుదీఱ. 51

క. అటువలెఁ బొడఁగని కేల్దవ
నిటలస్థలిఁ జేర్చి సంజనితకౌతుకవి
స్ఫుటదంతరంగుఁ డై య
జ్జటికులవల్లభుఁడు వాక్యచాతురి మెఱయన్. 52

సీ. భసితాంగరాగాయ భక్తానురాగాయ
సాలేక్షణాయ తుభ్యం నమోస్తు
భర్మాద్రిచాపాయ భద్రేంద్రవాహాయ
భయవిదూరాయ తుభ్యం నమోస్తు
భండనోద్దండాయ భానుప్రతాపాయ
భవ్యరూపాయ తుభ్యం నమోస్తు
భరతప్రవీణాయ భవనాయితనగాయ
భద్రప్రదాయ తుభ్యం నమోస్తు

తే. భావభవసంహరాయ తుభ్యం నమోస్తు
భవసరన్నావికాయ తుభ్యం నమోస్తు
భద్రచర్మాంబరాయ తుభ్యం నమోస్తు
భారతీశార్చితాయ తుభ్యం నమోస్తు. 53

వ. అని నమస్కరించి వెండియు. 54

సీ. జయజయ కైలాసశైలనికేతన
జయజయ దేవతాసార్వభౌమ

జయజయ గిరితనూజామనోంబుజభృంగ
జయజయ దైవవేశ్యాభుజంగ
జయజయ నిగమాంతసముదయసంవేద్య
జయజయ భువనరక్షాధురీణ
జయజయ జలజాతసంభవాండపిచండ
జయజయ శాశ్వతైశ్వర్యధుర్య
తే. జయపురందరహరివిరించనముఖాఖి
లామరస్తోమముకుటాంచలాంచితాబ్జ
రాగమాణిక్యరోచిర్విరాజమాన
చరణపంకేరుహోద్ధేశ జయమహేశ. 55
క. పరమేశ నిన్నుఁ బొగడఁగఁ
దరమే శేషునకు హరిపితామహబలసం
హరులకు సనకాదిమునీ
శ్వరులకు నొక్కింతయైన వర్ణింపంగన్. 56
సీ. మహిమ మీఱఁగ సర్వమంత్రరాజం బైన
గాయత్రి కీవె పో నాయకుఁడవు
శ్రుతు 'లేకయేవ రుద్రో నద్వితీయ'యం
చనిశంబు నిన్నె కా వినుతిసేయుఁ
బ్రత్యహంబును 'శివాత్పరతరంనాస్తి' యం
చలర స్మృతుల్ నిన్నె తెలుపుచుండుఁ
బురుషోత్తమఖ్యాతిఁ బరఁగువెన్నుఁడు వేయి
రాజీవముల నిన్నె పూజసేయు
తే. జలజగర్భుండు మొదలగుజంతువులకుఁ
బతి వగుటఁ జేసి నీకె విశ్రుతముగాఁగఁ

బళుపతిసమాఖ్య చెల్లె నబ్బురము మీఱ
నిన్నుఁ గొనియాడ నెవ్వరు నేర్తురభవ.

మ. కరికిన్ మర్కటకీటపోతమునకున్ గాలాహికిన్ మూలపో
టరికిం జెంచుకొలంపుబత్తునకు వేడ్కన్ మోక్షసామ్రాజ్యసు
స్థిరసౌఖ్యం బొనఁగూర్చి ప్రోచినకృపాసింధుండ వాహాభళీ
సరియే యాహరికున్ విరించికిని నెంచ న్నీకు శ్రీకంధరా.

తే. శ్వేతుఁడు మృకండుసూనుండుఁ బ్రేతనాథు
చేతఁ గడలేనియిడుమలఁ జిక్కి పొక్కి
నిన్ను శరణన్న జముఁ బడఁదన్ని వారి
కెన్నటికిఁ జావు లేకుండ నిడితి వభవ. 59

క. హరి తననయనాబ్జముతోఁ
దొరలఁగ నొకవేయివికచతోయజముల నీ
శిరమునఁ బూజించినఁ గని
యిరువుగ నాతనికిఁ జక్ర మిచ్చితివి గదా. 60

క. సురదనుజు లబ్ధిఁ దరువగ
గరళము ప్రభవించి జగము గాల్పఁగ దానిన్
సరగున గళమున నిడుకొని
పరిపాలించితివి గద ప్రపంచంబు శివా. 61

తే. భైరవాకృతియును వీరభద్రమూర్తి
శరభసాళువరూపంబు సరవిఁ దాల్చి
నళినభవదక్ష నారసింహులశిరంబు
లేపుమీఱంగఁ దునుమవె యీశ నీవు. 62

సీ. గడితంపుటపరంజిగట్టుసింగిణివిల్లు
గాలికోనపుఁదిండికాఁడు నారి

యీరేను మేనుల నేపుచూపులకోరి
యార్మాఁడుతునియాలై యలరు నరద
మిరుదుగ మొగములదొర తేరుపూన్పఁజె
పగటివేలుపు నేలబండికండ్లు
ప్రాఁబల్కుతుటుములు బలవారువంబులు
తెరగట్టుమన్నియ తెగలుబంట్లు
తే. గాఁగ దిగప్రోల్లుబలితంపుఁగడిమిఁ గూల్చి
జగము నావడి యుడిపి నిశ్శంక నలరు
నీప్రభావంబు బుధులు వర్ణింపఁ గలరె
భానుశతకోటిసంకాశ పార్వతీశ. 63

సీ. పులికరాసంబును బూదిగంధంబును
బుఱియకంచంబును బుసుకుపేర్లు
చిలువుటాసొమ్ములు చిక్కిలిమ్మొనవాలు
కంకటికోడ లేజింకకూన
పలుకుటందియలు చౌవంచనెమ్మొగములు
మెట్టబిడారంబు వెట్టకన్ను
చేతికుత్తుక యాలపోతు టెక్కెంబును
గ్రొన్నెలతలపువ్వు విన్నుదురము
తే. గలిగి వెలుఁగొందు నీమూర్తిఁదలఁపునందు
నిలిపి యేప్రొద్దుఁ గొలుతు నన్నేలమిఁబ్రోవు
శత్రుబలభీమ దేవతాసార్వభౌమ
గిరిసుతానాథ నిఖిలనిర్జరసనాథ. 64

తే. వేయినోళ్లను మఱి రెండువేలనాలు
కలు గలుగు శేషునకునైన నలుమొగముల

ప్రౌఢవైనను దరమె నిన్బొగడ నింక
వేయునేటికి ననుఁ బ్రోవు విశ్వజనక. 65

తే. అని నుతించుమునీంద్రుఁ గన్గొని శివుండు
సారకరుణామృతార్ద్రసుస్వాంతుఁ డగుచు
నుచితపీఠాంతరమునఁ గూర్చుండఁ జేసి
కుశల మడిగి యతిమధురోక్తులవచించె. 66

క. మునివర సకలజగంబులు
ననివారణముగ జరింతు నచట నచట నీ
కనుఁగొన్న వింత లెల్లను
వినుపింపుము మాకు వేడ్క విస్తరిలంగన్. 67

క. ఏయేజగములఁ జూచితి
వేయేదేశములు గంటి వేయేపురముల్
పాయక పొడఁగాంచితి విపు
డాయెడలం గలుగువార్త లచ్చుగఁ జెపుమా. 68

తే. అనిన నారదుం డిట్లను నభవ సకల
భువనములఁ జూచుకొనుచు నేఁ బోయిపోయి
నవకుతూహలమహితమానసుఁడ నగుచు
భూతలమ్మున నేలూరిపురము గంటి. 69

సీ. బహురత్నవిరచితప్రాసాదములచేత
రమణీయమణిగోపురములచేత
నిందిరాకరదివ్యమందిరంబులచేత
సుకరకపోతపాలికలచేతఁ
దపనీయమయదేవతాధామములచేతఁ
బటువజ్రసోపానపటలిచేత

భక్తశైలోన్నతప్రాకారములచేత
దివిజేంద్రనీలవేదికలచేత
తే. విమలపద్మాకరోద్యానసమితిచేత
గంధగజరాజధేనుసంఘములచేత
ధరణిసురముఖ్యసజ్జనోత్తములచేత
భవ్యగతిఁ బొల్పు నేయూరిపట్టణంబు. 70

చ. అసమశరోపమానసముదంచితవిగ్రహుఁ గంటి నందుఁ గ్రొ
మ్మిసిమికడానిబంగరపుమించులమించుపిసాళిమేసిరుల్
రసికమనోంబుజంబులకు రాగము గూర్పఁ గొఱంతలేని మే
ల్పస నలరారు నొక్కయెలఁబ్రాయపుజాలరికన్యకామణిన్.

ఉ. అన్నులమిన్నలం ద్రిభువనాంచితరూపవిలాసమాన్యలం
గన్నులఁ గంటిఁ గాని శశిఖండనమండన యిందునేని న
క్కన్నియవంటిసోయగపుఁగల్కిఁ గనుంగొను టెనెఱుంగ నో
యన్న గణింప శక్యమె మహామహికి దానికడింది యందముల్.

ఉ. కొమ్మలు సాటియే మరునికొమ్మకంబునఁ గ్రాలుజాళువా
బొమ్మకుఁ గమ్మవింటినెఱపోటరిక్రొవ్విరితోఁటలోనిదా
నిమ్మకు నిమ్ముల న్వలచునిద్దపుసంపెఁగపూవుకొమ్మ కం
దమ్ములకెల్ల నిల్కడ యనం దగు జాలరిముద్దుగుమ్మకున్.

చ. కులుకుమిటారిగబ్బిచనుగుబ్బలసౌరుజగానిగారపుం
బొలుకరికార్తెఱుంగుల నెదుర్కొనుకొప్పుమిటారునిద్దపుం
గలికిపిసాళివాలుతెలిగన్నులతీరు గణింప మాయురే
యల కలకంఠకంఠి కలరారునొయారులు దానికుద్దియే. 74

సీ. చిన్నారిజాబిల్లికన్నె గేదఁగిపువ్వు
వెన్నెలతెలినిగ్గువన్నెల గని

తళుకుపుత్తడిబొమ్మ తొలుకరిక్రొమ్మించు
        తలిరుజొంపపుమావిపలుకుచిల్క
చక్కెరలప్పగొజ్జఁగినీటిపెనువాఁక
        కపురంపుబరిణె చెంగలువకొలను
వలపులదీనిజవాదినించినబావి
        కమ్మకస్తురిక్రోవి నిమ్మపండు
తే. చికిలినిద్దంపుటద్దంబు పికిలిబెండు
మగువతలమిన్న వెలలేనిమానికంబు
నాఁగ నలరారు నయ్యేలనాగబాగు
దెలుప శక్యంబె యేలాటినలఁతికైన. 75
సీ. సతిమోమునకు నోడి చందమామ కృశించి
        వెలవెలనై బైట వ్రేఁగుచుండెఁ
జెలిక్రొమ్ముడికి నోడి తొలుకరిమబ్బులు
        నిలువెల్ల విషమూని మలలుముట్టె
నువిదపాలిండ్లకు నోడి బంగరుగిండ్లు
        కాఁకచే నుడుకుచుఁ గఱఁగఁబాఱెఁ
జేడికన్దోయికి నోడి బేడిసమీలు
        మిట్టిపాటున నేట బిట్టుపడియెఁ
తే. దరుణినునుజెక్కులకు నోడి దర్పణములు
మైల వాటిలఁ గొంతఁ గన్మాసి యుండె
నేమిచెప్పుదు నఖిలలోకేశ నీకు
దానిసౌందర్య మెన్న నాతరము గాదు. 76
సీ. అలికులవేణిశైవలరోమవల్లరి
        సారసవదనకల్హారపాణి

కలహంసగామినికచ్ఛపచరణాగ్ర
మకరజంఘాలతశశకులనయన
కలభోరుకాండకోకపయోధరద్వయ
సైకతజఘనకింజల్కరదన
కంబుకంధరవీచికావళియావర్త
నాభికావివరమృణాలబాహ
తే. యగుచు భువనాభిరామవిఖ్యాతి నెపుడు
వెలయుచున్నట్టి యాఘనవేణితోడ
గరుడగంధర్వయక్షకిన్నరనిలింప
భుజగగజగామినులు సాటి పోలఁ గలరె. 77

క. పొడవుగ నెగసి తళుక్కని
పొడచూపి యదృశ్య మగుచుఁ బోవు మెఱుంగుల్
పడఁతుక నెమ్మెయి జిగి కెన
యిడఁగాఁ బోలవుగదయ్య యిందువతంసా. 78

సీ. ఇది కీలుజడ గాదు చదువుపల్కులమావ
జీరునివాఁడికటారుగాని
యిది నెమ్మొగము గాదు కోదమతుమ్మెదనారి
విలుకానియద్దంపుఁ బలకగాని
యివి కటాక్షము లౌనె చివురాకుబాకుసా
ధనుగానితూఁపుమొత్తములుగాని
యివి కుచంబులు గావు పూజిరానెఱజోదు
మేలిబంగరుబొంగరాలుగాని
తే. యిది వలపుకెంబెదవి గాదు మదనభూప
కరవిరాజితపద్మరాగంబుగాని

యనుచు రసికాగ్రణులు దనయవయవములఁ
బొగడ నెగడొందు నౌర యాచిగురుఁబోఁడి. 79

సీ. కలికివాల్గన్నులఁ దిలకించి చూచిన
 వెడవింటిదొరబాణవృష్టి గురియుఁ
గులుకుచు జిలిబిలితెలినవ్వు నవ్వినఁ
 గమ్మగప్రపుదుమారమ్ము గ్రమ్ముఁ
దొకతొకవెలయుముద్దులమాట లాడిన
 సొంపార విరితేనెసోన చిలుకుఁ
బుడమిఁ జక్కఁగఁ జూచి యడుగిడి నడిచినఁ
 బలితంపుఁగెంపురంగులు వెలుంగు

తే. కచకుచకటిభరంబుచేఁ గౌను వడఁక
నూత్నచామీకరామూల్యరత్నఘటిత
కాంచికాఘటికాఘణంఘణలు సెలఁగ
దాసకులవారి మరునినిద్దపుఁగటారి. 80

ఉ. సుద్దులకేమి నాపలుకు శూనశరాంతకచిత్తగింపు మ
మ్ముద్దియతళ్కుచూ పతనుమోహనశాతశిలీముఖంబుతో
నుద్దిడుకంగఁ బోయి మది నూహ యొనర్పఁగ నట్లు గానిచో
నద్దిర యెల్లవారిహృదయంబులఁ గాఁడి చనంగ నేర్చునే. 81

ఉ. ఆలతకూన యాలలన యాలవలీదళకోమలాంగి యా
లోలకురంగశాబకసులోచన యామదచంచరీకనీ
లాలక యాసమగ్రతుహినాంశుమనోజ్ఞముఖారవింద యా
నీలకచాశిరోగ్రమణి నీకుఁ దగుం బెఱమాట లేటికిన్. 82

తే. గంగ యనుపేరు దన కెసఁగంగ భువన
మంగళాకృతి బొల్చునయ్యంగనాల

లాముఁ గనుఁగొంటివేని యోస్వామి నీకు
నిరుపమానందసంసిద్ధి దొరకుఁ జుమ్ము. 83

తే. అని మునీంద్రుఁ డెఱింగింప నభవుఁ డపుడె
కొలువు చాలించి యెల్లవారలను బోవఁ
బనిచి తనతోడ రాఁ గోరుపర్వతాధి
రాజపుత్త్రిక నంతఃపురమున నిల్పి. 84

సీ. జడలు చిక్కులువాపి నడునెత్తి సిగవైచి
తావిసంపెఁగపూలదండఁ జుట్టి
నిటలభాగమున సున్నోలిబూదిరేఖయుఁ
బూపకస్తురిచుక్కబొట్టు వెట్టి
వలువబంగరుశాలువలెవాటు గావించి
మొలఁ బట్టుదట్టియమ్ముల బిగించి
నులిచిగాఱెంపుమీసలు చక్క సవరించి
బవిరిగడ్డము దీరు వడఁగ దువ్వి

తే. కేలఁ జారుకపాలంబు గీలుకొలిపి
మేన నవగంధసారంబు మెదిచి పూసి
గిలుకుపావలఁ దొడిగి యిగ్గిరిశుఁ డప్పు
డతిమనోహరజంగమాకృతిధరించె. 85

వ. అట్లు జగన్మోహనోదారజంగమాకారంబు ధరించి చనుదెంచి యేలూరిమహానగరంబుఁ బ్రవేశించి తదంతికప్రదేశంబున నొక్కచోట. 86

మ. కనియె న్నీలగళుండు బిల్వబదరీఖర్జూరజంబీరచం
దనమందారలవంగచూతలవలీనారంగభల్లాతకీ
పనసాశ్వత్థకపిత్థతాలవటరంభానారికేళాదికా

వనిజాతానిశభానమానసునుసరోవాపీవృతోద్యానమున్. 87

సీ. కలకంఠకులకంఠకాకలీధ్వానము
ల్చెలఁగి దిగ్వలయంబు చెవుఁడు పఱుప
శుకశారికాకదంబకమృదుస్వనములు
జనుల కామోదంబు సంఘటింపఁ
బ్రమదనృత్యన్మత్తబర్హిణారావంబు
లవిరతశ్రుతిపుటోత్సవ మొనర్ప
నవనవమకరందనందితేందిందిర
గానము ల్చిరసుఖాకరము గాఁగ
తే. ఘనమరాళారవంబులు గ్రమ్ముకొనఁగ
బంధురసుగంధగంధిలగంధవాహ
శాబకము లోలి నధ్వక శ్రమము దీర్ప
నతిమనోహరగతిఁ బొల్చె నవ్వనంబు. 88

వ. అందు. 89

సీ. తావులీనెడుగుజ్జుమావిమ్రాకులచెంతఁ
బెనఁగొన్నగున్నసంపెఁగలపజ్జఁ
గపురంపుటనఁటిమోఁకలకంటిప్రాఁకిన
పరువంపుద్రాక్షపందిరులక్రింద
గమగమవలచుచొక్కంపుగొజ్జఁగినీట
నేటఁజక్కెరకడ నిరువుకొన్న
బలితంపుఁజెంగల్వబావులక్రేవులఁ
బన్నినచలువచప్పరమునీడ
తే. నందముగఁ బొల్చునిద్దంపుఁజందమామ
ఱాలఁ గట్టినజాళువామేలితిన్నె

మీఁద మోదంబు దళుకొత్త మిక్కటంపు
శివిఁ గూర్చుండె జంగమదేవుఁ డపుడు. 90

వ. అయ్యవసరంబున. 91

సీ. కురులుచిక్కులు విప్పి కొప్పు విప్పుగ దిద్ది
యసదుకస్తురిబొట్టు నొసలఁ బెట్టి
వలిపెచెంగావిపావడ చక్క సవరించి
కళుకుబంగరుచేలఁ గటి ఘటించి
చిలుఁగుపైఁ ఠాణికంచెల గుబ్బలు బిగించి
గడితంపువలిగమ్మగలప మలఁది
కలికికన్నులమించుకజ్జలంబు ధరించి
యలరుసంపెఁగదండ లరుత నించి

తే. హారకేయూరకటకమంజీరకాంచి
కాంగుళీయకకర్ణపత్రాదివివిధ
మణివిభూషణనిర్మలఘృణులు వెలుఁగ
గంగశృంగారలీలావృతాంగి యగుచు. 92

తే. నెచ్చెలులఁ గూడి వేడుక లచ్చుపడఁగ
నొచ్చె మొదవనిహాళి మైఁ బెచ్చువెరిఁగి
పచ్చవిల్కానిమేటిరా లచ్చి యనఁగ
వచ్చి చెచ్చెర శృంగారవనము సొచ్చి. 93

క. చొచ్చి రఘుణంఘువునినదస
ముచ్చయరంభాసమానమోహానకటకో
ద్యచ్చరణసరసిరుహ యై
విచ్చలవిడిఁ బూలుగోసె వెలఁదులు దానున్. 94

చ. చిలుకలఁ దోలి కోయిలలఁ జిందరవందరగాఁగ నేలికే
కుల బెదరించి తుమ్మెదల గుప్పునఁ బాఱ నడంచి యంచలం
గొలకులఁబాసిజక్కవలకు న్నిలరాయిలుఱచూపి పూఁబొదల్
వలఁగొని దూఱి కప్పురపువంతుల దాఁటి విహారలీలలన్. 95

తే. కప్పురము రేఁచి లతికాని కాయ మూఁచి
పాదపము లెక్కి తియ్యనిపండ్లు మెక్కి
సరసగతి డాసి తావిక్రొవ్విరులు గోసి
చెలులు పుష్పాపచయకేళి సలిపి రోలి. 96

సీ. కనకాంగి నీనాసికకు జోక యగువీఁకఁ
గనుపట్టుచున్నవి గంధఫలులు
శుకవాణి నీవాతెఱకు సాటి యగుపాటిఁ
దనరారుచున్నవి దాసనములు
ముకురాస్య నీగుబ్బలకు నుద్ది యగుబుద్ధి
నిం పూనుచున్నవి యీడెపండ్లు
కలకంఠి నీనాభికకు సరి యగుమురిఁ
బొలుపొందుచున్నవి పొన్నపూలు

తే. ముగుద నీదంతముల కెన యగుపొగరున
మురువుఁ జూపుచు నున్నవి మొల్లమొగ్గ
లనుచు నన్యోన్యసరసోక్తు లాడుకొనుచు
ననలు గోసిరి సరసిజాననలు మొనసి. 97

ఉ. అప్పుడుజంగమేశ్వరుఁడొయారముదద్దయుమీఱవేడ్కతో
గుప్పున లేచి పాదములగు త్తపుఁబావలుమెట్టి లీల న
య్యొప్పులకుప్ప లున్నయెడ కుబ్బలరారఁగఁ జేరికోరికల్
చొప్పడమ్రోలనిల్పిమదిఁజొక్కుచునబ్బురపాటు వాటిలన్.

సీ. చిన్నారిమోమునఁ జిలుగుచెమ్మటఁ గ్రమ్మఁ
గొనబారుపువ్వులఁ గోయుదాని
గడితంపులేయెండఁ గ్రాఁగిననెమ్మెయి
నీడల నందంద నిలుచుదానిఁ
దాఁటిపూఁబోదరిండ్ల దూఱుచో నడలిన
క్రొమ్ముడి సవరించుకొనెడిదాని
గుత్తంపువలిగబ్బిగుబ్బచన్నులమీఁద
నులుకొన్న సరు లిమ్ముకొలుపుదాని
తే. నీటుమీఱంగ జిలిబిలిపాటఁ బాడి
బోటులకు సంతసం బెదఁ బూచుదాని
వన్నియలకెల్ల మిన్నయై యున్నదానిఁ
జిన్నిప్రాయంపుజాలరికన్నెఁ గనియె. 99

చ. కని యెనలేనికూర్మి మదిఁ గ్రమ్మఁగ నమ్మఁగ మిన్నమిన్నకా
మనసిజరాజ్యలక్ష్మి యగుమానినిడగ్గఱఁ జేరి కోరికల్
బెనఁగొన నౌర యీఁకులుకుబిత్తరిగుత్తపునిండుగౌఁగిటం
దనివిసన౯సుఖింపక నితాంతలతాంతశరార్తి యారునే. 100

క. అన్నుల నెందఱినేనియుఁ
గన్నులఁ జూచితిమిగాని గరుడాహిమరు
త్కిన్నరనరభామలు నీ
కన్నెలతలమిన్నఁ బోలఁ గలరే యెన్నన్. 101

తే. సకియనెమ్మోము పున్నమచందమామ
కలికికన్నులు వాలుగగండుమీలు
పొలఁతిచనుగుబ్బ లపరంజిబొంగరాలు
తరుణిచెక్కులు మృదునవదర్పణములు. 102

తే. కలికి పదియాఱువన్నె బంగరుసలాక
గావలయు నద్దిరా యట్లు గాకయున్న
నఖిలసంగపరిత్యాగు లైనయతుల
డెందములకైన నాస పుట్టింపఁ గలదె. 103

చ పగడము బంధుజీవకముఁ బంకజరాగము దాసనంబు లేఁ
జిగురును బింబికాఫలముఁ జెందిరముం దిరమొప్ప నిప్పుడే
ముగుదులమిన్నతియ్యనును మోవికిసాటియటంచు నెంచఁగాఁ
దగదుగదా తగం దగవుదప్పి వచించుట దోసమేకదా. 100

చ. మొలకమిటారిగుబ్బలునుముద్దులుగారు మెఱుంగు చెక్కులుం
దళుకుపిసాళిచూపులును దమ్మివిరిన్నిరసించు మోముకొ్రం
దొలుకరిమబ్బులం దెగడుదోరపుఁగొప్పును గల్గియొప్ప ని
క్కలికియలంతిజవ్వనము గన్నులపండువయయ్యె నద్దిరా.

సీ. గజనిమ్మపండులగజిబిజి యొనరించి
మాలూరఫలములఁ గేలిసేసి
తమ్మిమొగ్గలచోకాటమ్మెల్ల సడలించి
క్రొన్ననబంతులఁ జిన్నఁబుచ్చి
కరికుంభములఁ దిరస్కారంబుగావించి
యపరంజిగిండుల నపహసించి
పొన్నకాయలసొరు సన్నగిల్లఁగఁ జేసి
జక్కవకవ నెకసక్కె మాడి

తే. మేలిరతనంపుబలుబొంగరాల దెగడిఁ
కనకధాత్రీధరేంద్రశృంగములఁ గేరి
లీల నలరారు నారమే లీలతాంగి
కులుకుసిబ్బెపువలిగబ్బిగుబ్బదోయి. 106

తే. బాలికామణి పెన్నెరుల్ బారెఁ జేసి
చేడియలమిన్న కన్నులు చేరెఁ జేసి
కలికి వలిగబ్బిగుబ్బలు గాటెఁ జేసి
చేసి నడుమేలమాయంబు సేసె నజుఁడు. 107

చ. నిలుకడఁగన్న కార్మెఱుఁగునిద్దపుఁబల్కులనేర్చుకొన్న క్రొం
దళుకుపసిండిబొమ్మ నెఱతావులుగాంచినమానికంబుచే
ష్టలుగలగుజ్జుమావి దిగఁజాఱిననిర్మలచంద్రరేఖ యీ
యలికులవేణిసోయగమయారెయొయారులనెందుఁ జెందునే

ఉ. అద్దిర! నాకు దీనినెన రబ్బినగొబ్బునగుబ్బదోయిఁ జే
కొద్దిగఁ బట్టి కౌఁగిటను గూర్చి నిగారపుమోవిపాఱెకు
స్మొద్దులుగొంచు మన్మథవినోదముల న్విహరింతుఁ గానిచో
నెద్దియు నామనంబున కొకించుకకోరికఁ దీర్ప నేర్చునే. 109

క. అని పలుకుచు మెల్లన య
వ్వనితామణిఁ జేర నరిగి వలపులు నిగుడన్
మనసిజమదసంహారుఁ డి
ట్లనియెన్ మృదువచనరచన లలరారంగన్. 110

క. ఎవ్వతవు నీవు దవ్వుల
బువ్వులగోయంగవచ్చి పొలుపారెదు లే
జవ్వనపు మేను గందఁగ
నివ్వనవీథిం జరింప నేమిటి కబలా! 111

క. కామునిఁ బూజ యొనర్పనో
హైమవతీరమణునకు సమర్పణ యిడనో
గోముగఁ బా న్పలరింపనొ
యేమిటి కీపూలు గోసె దిభరాడ్గమనా. 112

క. కొమ్మలను గూడి క్రొవ్విరి
కొమ్మలపై నిమ్ముమీఱఁ గూరిమిమరునా
లమ్ముల నెమ్మదిఁ ద్రిమ్మరు
తుమ్మెదలఁ గలంచె దిట్లు దోసము గాదే. 113

క. చెంగల్వలువలెనో గొ
జ్జెంగులు గావలెనొ మంచిచేమంతులు సం
పెంగలువలెనో తెచ్చెద
శృంగారవతీలలామ చెపుమా నాకున్. 114

క. కొమ్మా కొమ్మా యిదె విరి
కొమ్మ కరమ్మలసి సొలసి కోసితి నీకై
రమ్మా పూఁబోదరిండ్లకు
నిమ్మారఁగ మఱియుఁ గోసి యిచ్చెద నచటన్. 115

క. జిలిబిలి చెమ్మట మోమున
నలుముకొనం బోవలవింట నలసెద వేలా
వెలిపూసురటి న్విసరెద
నిలుమా యొక్కింతసేపు నీరజవదనా. 116

క. నను లాఁతివానిగా నె
మ్మనమునఁ దలఁపంగ జనదు మానిని వేడ్కన్
నునుగప్పురంపువిడె మిది
గొనుమా యనుమాన ముడిగి కువలయనయనా. 117

వ. అనిన నేమియు మాఱాడక గంగ యూరకుండినఁ దత్సఖీ
జనంబు లజ్జంగమయ్యం గనుంగొని యిట్లనిరి 118

క. ఎవ్వఁడవు రోరి నీ విపు
డివ్విధమున నాము మీఱి యేకతమ వనిం

బువ్వాలఁ గోయుచు మెలఁగెడు
జవ్వనులం జెనకి పొదువఁ జాగితివి భళీ. 119

క. ఏరా గారా మారఁగ
నారాటం బెత్తి హత్తి యబలలఁ జెనకన్
మేరా తీరా యూరక
పోరా పోరాము లుడిగి పొమ్మెటకైనన్. 120

వ. అనిన వారివచనంబులు సరకుఁగొనక వెండియు జంగమేశ్వ
రుండు గంగంగనుంగొని. 121

తే. పువ్వుబంతు లొసంగవే పువ్వుఁబోఁడి
చిగురుటాకైన నీగదే చిగురుఁబోఁడి
దండఁ గూరిచి యిడుము వేదండయాన
యనుచు మెల్లనె నర్మోక్తు లాడుకొనుచు.

సీ. కిన్నెర మీటి కన్గీటి సన్నలు సేయుఁ
బకపక నగి యేలపదముఁ బాడుఁ
గెంగేలలాంతంబు గిరగిరఁ ద్రిప్పు లోఁ
జొక్కుచు వెడవెడ మొక్కుమొక్కు
లింగ లింగ యటంచుఁ జెంగున దాఁటు మీ
సలు గీటు గడ్డంబుఁ జక్కఁదువ్వుఁ
గులుకుచు జిలిబిలిపలుకులఁ జెప్పు గా
మిడి యయి పైఁటకొం గొడిసి తిగుచుఁ

తే. దివిరి బతిమాలి దిక్కులు దిరిగి చూచు
నవలి కరుగుదోఁ ద్రోవ కడ్డపడి నిలుచు
వలపుమీఱంగఁ జెలిమరుల్ గొలుపుకొనుచుఁ
గోడెప్రాయంపుజంగమకులవిభుండు.

క. క్రొమ్మావికొమ్మచివురదె
కొమ్మా కెంగేల నందుకొమ్మా యని మే
లమ్మాడుఁజిలుగుపయ్యెదఁ
గ్రమ్మినవలిగుబ్బదోయిఁ గనుఁగొను వేడ్కన్. 124

వ. ఇత్తెఱంగున హారంగునం జెలంగి మెలంగుజంగమపుంగ
వుం గనుంగొని యంగనామణు లిట్లనిరి. 125

క. మున్నెప్పుడుఁ గొమ్మలతో
నెన్నికగాఁదిరిగినాఁడ వేమి బళా మేల్
కన్నెలవెంబడిఁ బడి కడు
మున్నతికెల మెలఁగె దిట్లు మోసంబుగదా. 126

క. కొంచక మున్నందఱి భ్రమ
యించితివి గదా చెలంగి యీవేసమునన్
మంచిది నీదత్తురము లొ
కించుక మాయెడల సాగ వే లామాటల్. 127

సీ. కరతాళగతు లెసంగఁగఁ దందనా లాడి
చొక్కుచుఁ జిందులు ద్రొక్కెదేమి
కిలకిల నగుచుఁ గన్గీట సన్నలు సేసి
వలిపువ్వుఁబోదలకుఁ బిలిచెదేమి
గరువంపుఁజిన్నరాగము దీసి యబ్బుర
పాటుగాఁ గిన్నెర మీటెదేమి
చెలరేఁగి గురవప్ప శివయంచు నటువలె
వెడవెడ గంతుల వేసెదేమి
తే. కడిఁదియొయ్యార మేపార నడరి మంచి
విరులబంతులఁ దెమ్మిని వేఁడెదేమి

జోగు లెచ్చట యిల్లాలిజోటు లెచట
కానిబుద్ధులు మాని వేగంబె చనుము.

క. అనవిని జంగమతేఁ డా
ననబోఁడుల నీసడించి నగుచుం గన్యా
జనచూడారత్నంబుం
గనుఁగొని వెండియును నేర్పు గదురఁగఁ బలికెన్. 129

ఉ. అంగన నిన్నుఁ గంటి నెఱియం గనుపండువు గాఁగ నేఁడు నీ
బంగరుబొంగరాల కెనవచ్చుమిటారపుగబ్బిగుబ్బలు
ప్పొంగఁగఁ గౌఁగిలించి వలపుల్ దలుకొత్త సుఖంపజేయవే
జంగమవారిపాపఁడ భుజంగకలాపమనోజ్ఞభూషుఁడన్. 130

క. వెండియుఁ బైఁడియు నాయెడఁ
గొండలవలె నుండు మెండుకొని యెప్పుడు నో
యండజగామిని చూడ న
ఖండమహోన్నతవిభూతిఁ గలవాఁడఁ జుమీ. 131

తే. ఎంతకన్నను నీడక న్నెలుఁగకుండ
గరిమ నుండుదుఁ దలపువ్వు గందకుండ
నెలఁత నన్నేలు చిరసుఖాన్వితుని జేసి
నిన్ను నేప్రొద్దుఁ దలమీఁద నిలుపుకొందు. 132

తే. అంబుజాక్షి కుబేరునియంతవాఁడు
బలియుఁ డొక్కఁడు చెలికాఁడు గలఁడు నాకు
మఱియుఁ దఱలనిసిరి గలనెఱ యనుంగు
గలఁడు గద నాకు బ్రహ్మను గన్నవాఁడు. 133

క. మేనెల్లఁ దెల్లఁబాఱెను
గానంబడ దిప్పు డొక్కకన్నులకంబుల్

జానరవిజడలుకంటెను
జానరో నినుఁ గోరి పైదొసంగులు వడుటన్. 134

తే. అన్న మెన్నఁడు నెఱుఁగ నీయానఁ గన్ను
దెఱవ వెఱతును మంటచేఁదెఱలుచుండు
మేను సగమయ్యెఁ గుత్తుకలోని చేఁదు
వదల దలివేణి నీమీఁదివలపుకతన. 135

క. పులికిని భూతంబునకున్
బలితపుమత్తేభమునకుఁ బాముకు నెదలోఁ
దలఁకక తిరిగెద నెప్పుడుఁ
బొలఁతీ నీమీఁదివలపు పోరిఁబోరిఁ బెరయన్. 136

శా. రావే మత్తచకోర చారునయనా రావే జగన్మోహినీ
రావే రాజమరాళశాబగమనా రావే లతాంగీమణీ
రావే పూర్ణసుధామయూఖవదనా రావే మిళిందాలకా
నావెంటన్ లతికాగృహంబునకుఁ గందర్పాహవక్రీడకున్.

క. మారుని నే మును గెలిచితి
వైరము దీర్పంగఁ బూని వాఁ డిపు డెదిరెన్
హా రమణీరతిరమణుని
హారమణీ నన్ను రతుల నలరింపఁగదే. 138

సీ. కొమ్మకొమ్మనికమ్మకెమ్మోవిపానకం
బెమ్మెతోఁ గ్రోలంగ నియ్యరాదె
తళతళల్ దులకించు బెళుకువాల్గన్నుల
సొంపార మోమెత్తి చూడరాదె
నిక్కుచక్కనిగుబ్బ లక్కునఁ గదియించి
బిగియారఁ గౌఁగిటఁ బెనచరాదె

ఘనజఘనస్థలఘటితనీవీబంధ
మెడలించి మరుకేళి నెనయరాదె
తే. చిల్కచిల్కనఁ దేనియల్ చిలుకఁ గులికి
పలుకఁగారాదె సిగ్గు నిప్పచ్చరముగఁ
జెలులటక్కులఁ దలఁపున నిలుపఁబోక
మానినీమణి తమిఁ దీర్చి మనుపు మిపుడు. 139

క. అగ్గలపువలపు సొలపులఁ
బెగ్గిలి నిను వేఁడుకొనెదఁ బ్రియమారఁగ నన్
బిగ్గఁ గవుగింటఁ గూర్పవె
సిగ్గెల్లను వీడనాడి చిగురుంబోఁడీ. 140

క. న న్నన్యం గా నెన్నక
సన్నకసన్నగను గోర్కె సమకూర్పవె నీ
క న్నెఱికపుమున్నెఱికపు
మున్నెఱికలు సూపనేల ముద్దులబాలా. 141

వ. అని యనేకప్రకారంబులఁ బ్రార్థించిన నమ్మించుఁబోఁడి యిం
చుక తల వంచియూరకున్న సంగడికత్తియ లజ్జంగమేశ్వరున
కి ట్లనిరి. 142

క. జంగమదేవర వని యొక
భంగిం దాగితివి గాక బాపురె నిన్నున్
భంగించి పాఱఁ దఱుమ మె
లొంగక మఱియొక్కరైన లోకం బెఱుఁగన్. 143

క. అఱమఱ లేటికిమాతో
మఱిమఱిఁ గొఱగానివెడఁగుమాటలు వలుకన్

వెఱవవు మంచిదె మాచే
నెఱిఁగెదుగద యింక నిపు డహీనగుణాంకా. 144

చ. సరిసరి మంచిజాణవె విచార మిఁకేటికి నన్యకామినీ
సురతవిహారలంపటతఁ జొక్కుచు మేలము లాడవచ్చె నీ
కరణి మెలంగుచుండుటకుఁ గా దనువారలు లేరు ధాత్రిపై
హరిహరియింతదుండగపుటాటలఁగంటి మెయెందు నేనియున్

క. తిరుసుకదినునీ వెంతర
కర మరుదుగ నుదుటఁ గన్ను గలవాఁ డైనం
దరలి చనగలఁడె మాతో
విరసించి యహహ కడిందివింతలు పుట్టెన్. 146

క. కావరమున మాచెలిపై
నీవిధమునఁ గన్ను వేసి యెలవించెద హా
మావారు విన్న జంగమ
దేవర ననుకొన్ననీకుఁ దిప్పలు రావే. 147

వ. అనిన నజ్జోగిరాయండు వారల కిట్లనియె. 148

మ. పలుచందంబుల వేఁడుకొన్న నకటా బాలామణిం గూర్పకే
చల మారం గలఁగిం(హి)పఁజూచితిరి వాచాలత్వముల్మీ జనె
చ్చెలులిట్లుండదఱు మీరు గ్లుటకు రాజీవాననుం గంతువా
లలరుందూపులపాలఁ బో నిడెదరా హాయెంతగయ్యాళులే.

మ. కలకంఠంబులు శారికల్ శుకములుంగాదంబముల్ భృంగముల్
బలము ల్తోడుగవెంట నంటికొలువన్ బాలానిలంబు ల్కెలం
కుల రాఁ బంకజవైరి మింటవెలుగం గోయంచుఁబెల్లార్చిమీ
కలకంఠీమణిపై మరుం డెదురుచోఁగాపాడఁగా నేర్తురే. 150

వ. అని పలికి వెండియు గంగం గనుంగొని. 151

క. ఉన్న విధంబున వేఁడిన
సన్నక నన్నుఁ గనుకొని శ్రేష్ఠ సమకూర్పక హా
మిన్నంది పొంగి పొరలెద
వన్నన్న గణింప బల్గయాలివి గదవే. 152

క. తారుచుఁ బూపొదలెల్లను
దూఱుచు బలితంపుఁ జెట్లతుది కెక్కి వడిం
జాఱుచుఁ బెద్దలయానతి
మీఱుచు విహరింప నీకు మేరయె చెప్పుమా. 153

క. పలుమఱుఁ బతిమాలిన లోఁ
గలఁక వహించుకొని లోతుఁ గనఁబడనీ కీ
మలకలఁ బెట్టెదు నీకు
న్నిలువెల్ల విషంబు గదవె నీరజగంధీ. 154

క. విను విను నాపలు కిప్పుడు
వనజాతముఖిలలామ వాలెము నాతోఁ
బెనఁగొనఁగఁ జనిన నవ్వల
ననిశము భంగములపాల నడలెదవు సుమీ, 155

తే. అనినఁ జిఱునవ్వు లోలోన నడచుకొనుచు
గంగ తనతళుక్కుల్గ్రొవ్వాడికలికిచూపు
లతనుపిరిగల్వతూపులై యతనికాఁడ
నింపు దీపింప మెల్లన నిట్టు లనియె. 156

క. భళిభళి సర్వజ్ఞుఁడవే
పలుకుల కింకేమి లాఁతిపడుచులవెంటఁ

వలఁగొని తిరిగెదునిన్ని
యిలఁ గా దనువారు లేరె యెంతటివారున్. 157

తే. పరసతిలోలుఁడవు నీవు బాళి మీఱ
నచలసంస్థితి సానుల నంటి తిరుగఁ
జెల్లుగా కిట్టు లిల్లాండ్రఁ జేరి మెలఁగఁ
జనునె నీనెయ్య మింకఁజాలుచాలుపొమ్ము. 158

తే. అని పలుకుచున్నచోఁ జెలు లద్దిరయ్య
జోలెజంగంబు నీ కింతజోలియేల
సరి భళా పదపదరె యం చరిదిహాయులు
గదురఁ జనుదెంచి రింద్లకు గంగఁగూడి 159

క. అత్తఱి జంగమరాయఁడు
చిత్తము తత్తరముఁ జెందఁ జిడిముడిపడుచున్
బిత్తరిహాయు లెదఁ బెనఁగొన
మెత్తంబా టూని చనియె మెల్లనఁ బురికిన్. 160

వ. చని యొక్కవివిక్తదేవతాగారంబున నుపవిష్టుండై యుండె
నని సద్యసాచికి గాంగేయుం డెఱింగించిన నతం డతని నవ్వ
లికథావిధానం బెట్లని యడుగుటయును. 161

ఆ శ్వా సాం త ము.

మ. శరదిందూపమదేహ నిర్జితవిపక్షవ్యూహ కైలాసభూ
ధరశృంగాటకగేహ దీనజనసంత్రాణామితోత్సాహ భా
స్వరగోవల్లభవాహ పర్వతసుతాసంభోగకేళీకళా
నిరతాభ్యంచితమోహ సారబలనిర్భిద్రాగ్రబాహార్గళా. 16

క. కరుణావరుణాలయ గిరి
శరణా శరణాగతార్తజనఘనభయసం
హరణా తరుణాభామృత
కిరణాభరణా సమగ్రకీర్తిస్ఫురణా. 163

మాలిని. పురదనుజవిభంగా భూషితోద్యద్భుజంగా
సురుచిరధవళాంగా సూరిచేతోబ్జభృంగా
కరకలితకురంగా కాంతగంగోత్తమాంగా
తరణిశశిధరాంగా దైవవేశ్యాభుజంగా. 164

గద్యము. ఇది శ్రీమత్కుక్కుటేశ్వర కరుణాకటాక్ష నిరీక్షణ సంలబ్ధ సరసకవితాసామ్రాజ్యధురంధర ఘనయశోబంధుర కౌండిన్యసగోత్ర పవిత్ర కూచిమంచి గంగనామాత్యపుత్త్రి సకలసంస్కృతాంధ్రలక్షణకళాకౌశలాభిరామ తిమ్మకవి సార్వభౌమప్రణీతం బైనశివలీలావిలాసం బనుశృంగారరస ప్రబంధంబునందుఁ బ్రథమాశ్వాసము.

ద్వితీయాశ్వాసము.

శ్రీరాజితగుణసంగా
ఘోరాఘతమఃపతంగ కుతలశతాంగా
తారేశహారనారద
హీరాభశుభాంగ కుక్కుటేశ్వరలింగా. 1

వ. అవధరింపుము పాండునృపాలనందనునకు గంగానందనుం డిట్లని చెప్పం దొడంగె నట్లు శాంబరి జంగమేశ్వరుండు వివిక్తదేవతాగారంబున వసియించి యున్న సమయంబున.

తే. సకలలోకాధిపతి యైనశంకరుండు
గంగకై బిట్టు వంతలఁ గలఁగుచుండెఁ
బగలు సేయుట తగదని పరచె ననఁగఁ
గమలహితుఁ డస్తశైలశృంగమునఁ జేరె. 3

తే. కాలకంఠుండు జాలారికన్నె తనకు
నబ్బ నని యుబ్బి తాండవం బాడుచున్నఁ
జదలఁ బర్విన కెంజాయజడ లనంగ
నంబరస్థలి సాంధ్యరాగంబు మెఱసె. 4

తే. చిగురువిల్కాఁడు తనతొంటిపగఁ దలంచి
విశ్వరూపంబు దాల్చి కోవెలలు నళులు
గ్రమ్ముకొని కొల్వఁ జంద్రశేఖరుని మీఁదఁ
గడఁగి దండెత్తె ననఁగ జీకటులు పర్వె. 5

క. సుర లపు డంబరకేశుని
శిరమునఁ బూజించుచున్నఁ జెన్నారెడుక్రొం
బరువంపుబొండుమల్లియ
విరు లనఁ దారకలు గగనవీథి న్మెఱసెన్. 6

క. హరునకు గంగకుఁ బెండిలి
సరగున నగు నని నిలింపసతు లారతు లీ
గరములఁ బట్టిన మేల్బం
గరుపళ్లెం బనఁగఁ దుహినకరుఁ డుదయించెన్. 7

తే. భవుఁడు జాలారికన్నకై బడల నొడలి
విరహపరితాపజనితపాండురమరీచు
లబ్బురంబుగ జగములఁ బ్రబ్బె ననఁగఁ
బండురేయెండ లెల్లెడ నిండుకొనియె. 8

ఉ. జంగమరాయఁ డయ్యెడల జాలరిలేమయొయార మాత్మ వే
భంగుల నెంచి దర్పకుని బారికి బిట్టు చలించి యార సా
రంగవిలోచనామణి పరాకున స న్గికురించి యేగుచో
బంగరుపైటకొం గొడిసిపట్టి పెనంగక పోవనిచ్చితిన్. 9

ఉ. గద్దరిబోటికత్తియలు గ్రమ్మి నయమ్ముగఁ బెక్కులాగులన్
సద్దులు సేయఁగా భ్రమసి జంటఁ బెనంగఁగ నేరనైతి వే
సుద్దులకేమి యీపలువజోటులపంతము దీఱె నేఁడు నా
బుద్ధికి మోస మయ్యెఁ గదబూ మెలగీములు వామలోచనల్.

చ. మరుఁడు విరోధి చంద్రుఁడును మందసమీరుఁడు నేలనిల్పరీ
పరభృతశారికానికరబర్హిమరాళశుకీమధువ్రతో
త్కరములు నాకు ఘాతములు కంజముఖీమణి బల్గయాళి హా
హారిహరి యింక నీసరసిజాంబకబాధల కెట్లు దాలుదున్.

ఉ. ఏగతిఁ దాఁటువాఁడ నిపు డెవ్వరి నేక్రియ వేఁడువాఁడ న
బ్బా గిరి నింక నెందు సులభంబుగ గన్గొనువాఁడ నెట్లు పై
వేగినదాకఁ దాఁకువెడవిల్తునితూపుల నోర్చువాఁడ నా
హా గురులింగదానిహాయలాత్మఁ దలంచినగుండె ఝల్లనున్.

ఉ. హా వికచారవిందముఖి హా మదమత్తమరాళగామినీ
హా విబుధేంద్రనీలరుచిరాలకజాలక హా విలాసినీ
హా వరవర్ణినీజనశిఖాగ్రమణీ రమణీ ననుం గదుర్
భావభవప్రసూనశరబాధల కగ్గముసేసి యేగితే. 13

క. చిరసుఖదాయిని వని నిను
నిరవొప్పఁగ వేఁడుకొనిన నిటు భంగములం
బెరయించి లోఁతు చూపక
దరిఁ జేర్పక సుళ్లఁ బెట్టఁ దగునే గంగా. 14

క. నీకరుణామృతధారా
శీకరములఁ బైనఁ జిల్కి చెచ్చెరఁ దాపో
ద్రేకము చల్లార్పం గదె
రాకాహిమధామసమతరంగా గంగా. 15

వ. అని మఱియు విరహావేశంబున. 16

ఉ. ఎక్కడ నల్కుడైన జలజేక్షణ వచ్చె నటంచు లేచి న
ల్దిక్కులు సూచి కానియెడ దీనత నుస్సురటంచు నూర్చునే
చక్కట నెద్ది గన్గొనినఁ జాన శుభాకృతిగాఁ దలంచు హా
చక్కెరబొమ్మ యంచుఁ బలుచందములం బలవించుసారెకున్.

ఉ. కన్నులుమూయుఁ ద్రుళ్ళిపడి గ్రక్కునదిక్కులు రోయు నూరకే
సన్నలు సేయుఁ బైవలువఁ జయ్యన నవ్వలఁ ద్రోయు మింటిపై

వెన్నెలఁగాయుచందురుని వేఁడికిఁ దాఁ బెడఁబాయు నద్దిరా
చిన్నెలజంగమప్రభుని చిత్తవికారము లెన్నఁ జిత్రముల్.

క. అళికీరశారికాపిక
కలహంసమయూరకోకకలరవకురలీ
కులరవముల కులికిపడుం
జలిమలయల్లుండు గుండె ఝల్లని లీలన్. 19

వ. మఱియును. 20

క. మదనాదాసకులాంబుజ
వదనామణికొఱకు నేను వందురఁ బోనీ
కదనా యిటు లేపఁగ నఖ
గద నాచే నైనతొంటికత మఱచితివా. 21

తే. మొదల నిలమీఁదఁ బడఁదన్ని పిదప నాద
రించి తలనుంచుకొనుటకు మంచిలెక్క
హా గురుద్రోహి వగుటెల్ల నగపడంగ
నన్ను బన్నంబునొందింపఁ జన్నె చంద్ర. 22

వ. అని బహుప్రకారంబుల మనోవికారంబులం బొరలుచుండె
నంత నిక్కడ. 23

తే. గంగముద్దుగుల్కెడునాజంగమయ్య
చెలువుమదినెంచి వలవులు చెంగలించి
యంగభవశాతచూతసాయకపరంప
రావికంపితహృదయరాజీవ యగుచు. 24

చ. కళవళపాటుతో నులకకంకటిపై మెయిఁ జేర్చి తద్దయున్
సొలయుచు మోవిమానికపుసొమ్ములు వేసడలించివైచియూ

ర్పులునిగుడించుచుం జెలిమిబోటుల బిట్టుసళించుచుంగడున్
వలపుల వెచ్చ హెచ్చ మదవారణయానమదిం జలించుచున్.

క. చిలుకలు నంచలు గోదలుచుఁ
బిలిచిన మాటాడ నోడి బెగ్గిలుచు మదిం
గలఁగుచుఁ బండుచు లేచుచు
బలవించుచు వగలఁ బోగిలి బాములఁ బడుచున్. 26

మ. తలయూఁచుం దనలోనఁ దానె నగుఁ జెంతం జేరఁగానీక నె
చ్చెలులం దిట్టుఁ గనుంగవం బడిబడిం జిప్పిల్లు బాష్పాంబువుల్
తెలివారుం గొనగోళ్ల మీటుఁ బోగలున్ దివ్యప్రతాపోజ్జ్వల
జ్జలజాతాంబకశాతచూతవిశిఖస్ఫారానలజ్వాలలన్. 27

వ. ఇట్లు విరాళిం గ్రాలుచుండి మఱియుం దనలోన. 28

ఉ. ఏటికిఁ బువ్వవోంఫునకు నేఁగితి నేఁగిన నందు నీటునం
బాటిలు మన్న క్రొందలిరుఁబ్రాయపుజంగము నేలఁ గంటి న
మ్మేటి నటు ల్గనుంగొని తమిం గవఁగూడక యేలవచ్చితిన్
బూటకపుంబోలంతుకలు బూమెలఁ బన్నిరిఁకేమి సేయుదున్.

వ. అని జంగమేశ్వరుం గురించి యిట్లనియె. 30

తే. చిగురువిల్కాని గెల్చు నాసొగసుకాఁడు
లీలమై వచ్చి నన్బతిమాలుకొనిన
బేలనై యేలఁ బొమ్మంటి జాలిమాలి
చెల్లఁబో నింక నే నేమి సేయుదాన. 31

ఉ అక్కట గబ్బిగుబ్బగవ నక్కునఁ జేర్చి కవుంగిలించి క్రొం
జక్కెరమోవిపానకము సారెకుఁ జాల నొసంగి వానితోఁ
జక్కెరవింటిమేల్బిరుదుసంగరలీలసుఖింపకున్నచో
గ్రక్కున నాకు నీసుమశరప్రదరానలతాప మారునే. 32

ఉ. కిన్నెర మీటుచు న్స్వరగతిఁ గేరి యలంతిగఁ బాటఁ బాడు
చుండ్, సన్నలు సేయుచు న్బిగువుచన్నులపైఁ గను వేసి డా
యుచుండ్, సన్నకనన్నుఁ బూఁబొదలచాయకు రమ్మని వేడు
నీహొయల్, గన్నులఁ గట్టినట్టు లగుగద్దరిజంగమరాయ
సాంరెకుండ్. 33

ఉ. ఇందునిభాననామణుల నెందఱి నెందఱి ము న్భ్రమించి శ్రీ
నందనుఁ బాఱఁద్రోచితివి న న్నటుల న్వలయించి నెమ్మదిం
గొందల మందఁజేసి యెటకో చనుదెంచితి నీతుటారపుం
జంద మెఱుంగనైతిఁ గద జంగమరాయ సతీమనోహరా. 34

క. మారాశుగశుకమధులి
ట్పారావతపికను రాళబర్హిమరున్నీ
హారాంశులసడి కళికెద
రారా నన్ ప్రేమ నేలరా రభసమునన్. 35

తే. పూలు పన్నీరు గందంబుఁ బోఁక లాకు
లనఁటిపండులుఁ జక్కెర యగరుఁ గప్పు
రంబుఁ గస్తురిఁ గుంర్చి యర్చన లొనర్తు
రార వైళంబ జంగమరాయ యిపుడు. 36

వ. అని వగలం బొగులుచున్న మగువం గనుంగొని సఖశిఖామ
ణులు దమలో నిట్లనిరి. 37

తే. కూళజంగంబు వాలారుగోళ్లనిండ
వలపుమందేమొ చల్లి యిక్కలికి నిట్లు
మరులు గొల్పెను గాఁబోలు మాయగాండ్రు
బోగులను నమ్మవచ్చునె సుదతులార. 38

తే. ప్రేతభూములఁ దిరుగుచు భూతకోటి
వెంటఁ జనుదేర వేల్పిడి యింటిఁ బూసి
తోళ్లు బుసుకలు నెమ్ములు బెల్లు దాల్చు
జోగులకు మందుమంత్రముల్ జోలెనుండు. 39

వ. అని గంగం గనుంగొని. 40

తే. ఏమె నీ నెమ్మనాన సిగ్గింతలేక
వాసిఁ దిగనాడి పొగలెదు గాసిఁబడుచుఁ
బెద్ద లెన్నంగఁ దగిననీబుద్ధి విడిచి
చిడిపిజంగంబు దా నేమిసేసెనొక్కొ. 41

తే. తల్లిదండ్రులు గులముపెద్దలును మఱియుఁ
దగినచుట్టంబులును విన్నఁ దప్పుకాదె
చిన్నదానవు నీ విట్లు సిగ్గుమాలి
పలుదెఱంగుల నొరలంగఁ బాడియగునె. 42

క. కటకట పిడికెడుకూటికిఁ
గొటికెలఁ బడి బికిర మెత్తుకొని మనియెడు న
ష్టటుమాయజంగమునకై
యిటువలెఁ గృశియింపఁదగునె యిందునిభాస్యా. 43

తే. వద్దు మాయమ్మ యిఁక మంచిబుద్ధిగలిగి
దత్తురపుజంగమయ్యపైఁ దలఁపువిడిచి
నెమ్మినుండుము శుభములు నివ్వటిల్లు
జోగు లెచ్చుట నాడెంపుజోటు లెచట. 44

సీ. కటకట నాఁకటఁ గస్తి వొందఁగనేల
వెసఁబట్టి దోరెంబు మెసఁగరాదె

యొడలెల్ల బిగిదప్పి బడలి యుండఁగ నేల
యగరుగస్తురిగంధ మలఁదరాదె
సొగసెల్ల విడిబాసి వగలఁ గుందఁగ నేల
వెలలేనిరవణము ల్వెట్టరాదె
తలయెల్ల జడగట్టి మలిన మొందఁగ నేల
తీరుగాఁ గ్రొమ్ముడి దిద్దరాదె
తే. గట్టివలిపట్టుపుట్టము ల్గట్టరాదె
చెలఁగి కపురంపుఁదములంబు సేయరాదె
దావిక్రొంబువ్వుసరములఁ దాల్పరాదె
యువిద నీ కిది యేలాటియోజ చెపుమ. 45

చ. చిలుకలఁ గొట్టదేమి దరిఁ జేరినబోటులఁ దిట్టదేమి పె
న్వలపులఁ బొక్కదేమి తలవంచి మదిం గడుఁ జొక్క
దేమి యూ,ర్పుల నిగుడించెదేమి కనుబ్బొమలసారె ముడిం
చెదేమి హా,చిలుకలకొల్కి నీవెడఁగుచిన్నియ లిన్నియుఁ
జెప్పఁ జిత్రముల్. 46

వ. అనిన వారల కాకన్యకామణి యిట్లనియె. 47

క. చెలులార యింతనెగ్గులు
వలుకంగా నేల లచ్చికొమరుని కెనయౌ
చెలువము గలయవ్వలఁతికి
వలసితి మీతోడ నింక వాదము లేలా. 48

తే. వినుఁడు నామాట మీ రెల్ల వీను లలర
నలినముఖులార నాప్రాణనాథుఁ డైన
జంగమస్వామిఁ దెచ్చి యోర్వంగరాని
మదనవిశిఖార్తి మరలించి మనుపరమ్మ. 49

ఉ. బంగరుపట్టుపుట్టములు భాసురరత్నవిభూషణంబు లు
ప్పొంగఁగ మీకు నిచ్చి పరిపూర్ణకృపామతి నాదరింతు నా
లింగముతోడు నాపలుకు లెన్నగ నమ్ముఁడు బోటులార యా
జంగమరాజశేఖరుని జయ్యన నిచ్చటఁ దెచ్చి నిల్పుఁడీ. 50

క. ఇవ్విధము గాకయుండిన
నవ్వల అవ్వలఁ బెనంచి యందఱిలోనన్
నవ్వులఁ బెట్టక యూరకె
పువ్వారంబోఁడులార పొం డిరువులకున్. 51

మ. కులమెల్ల న్నిరసించి గేలి యిడ నీకోపంబు దీపింప మా
తలిదండ్రుల్ నిలయంబునం దిడక పంతంబారఁ బోఁదోల నీ
చెలికత్తెల్ మఱి మీర లందఱును ఛీఛీ యంచుదూషింపనీ
వలఁతేనిన్నగువానికౌఁగిటను నే వాలంబు గ్రీడించెదన్. 52

వ. అని కనరుగనంబడం బలికిన నళికి చెలికత్తియ లొండొరు
లమొగంబులు చూచుకొనువారును, గుజగుజలం బోవువా
రును, సళించువారును, నీసడించువారును,నిదె మిడిమేళం
బనువారును నై యుండి యలసి కొంతతడవున కించుక
గనుమూసి నిదురింపం దొడంగి రాసమయంబున. 53

తే. గంగయుఁ గడితపువలువచె
ఱంగు ముసుంగిడి కడిందిఱాతనమున నా
శృంగారవనికి మెల్లనె
జంగమపుంగవుని వెదుకఁ జనియె నొకర్తై. 54

వ. అట్లు చని వనిం బ్రవేశించి 55

సీ. కొనుగకగాటంపుఁబొదరిండ్లదండలఁ
గొదకొని సారెకు వెదకి వెదకి

తిన్ననికపురంపుఁదిప్పలచొప్పుల
నిలుచుచు నందంద నెమకి నెమకి
వలపుగొజ్జఁగినీటివంతల చెంతల
డాసి పల్దెఱఁగుల రోసి రోసి
పరువంపువలిదాఁక పందిళ్లసందుల
సొలయుచు మఱిమఱిఁ జూచి చూచి
తే. వలపు లంతంత కుబ్బ నవ్వన్నె కాని
నెందుఁ బొడగాననేరక కుంది కుంది
యిందువదన వనీతరుబృందములను
ఆశ లడరంగ నిట్లని యడుగఁదొడఁగె. 56

సీ చిన్నారివగకాఁడు చెన్నార మీవద్ద
నిలిచియుండఁడుగదా నిమ్మలార
సింగారములకుప్ప చెలువొప్ప మీకడ
మొనసియుండఁడుగదా పనసలార
ముద్దుజంగమతేఁడు ముదిమీఱ మీపజ్జ
మసలియుండఁడుగదా మావులార
నెఱజాణతలమిన్న నీటార మీచెంత
దాఁగియుండఁడుగదా దబ్బలార
తే. యలరువిలుకానిఁదెగడుసోయగము గలిగి
కడిఁదిమీచాయనిగ్గులు కడలఁ బర్వ
జగము లెల్లను వలయించుజగమగండు
మీకడకు రాఁడు గద వలిదాఁకలార. 57

క, ఈ డెన్న రానిసొగసుల
నా డెందము గరఁగఁజేసి నలిఁ బెట్టినయా

పోఁడలతలమానిక మిపు
డీఁడా నీనీడ కీడ కేతేరఁడుగా. 58

క. అన్నన్న కడిఁదివగలన్
నన్ను న్వలయించి చనుట నాయమె వానిం
గన్నారఁ జూపఁగదవే
పొన్నా నీ కెన్నరానిపుణ్యంబు గదే. 59

క. జగమెల్లను వలయింపఁగఁ
దగుసోయగమున వెలుంగుదంటవిరాళిం
బొగలించి చనియె వానిం
బొగడా గనఁజేయునీకుఁ బొగడిక వచ్చున్. 60

తే. తలిరువిల్కానిదాడికి నళికి యుళికి
పలుదెఱంగుల నినుఁగోరి వలసియున్న
చెలియ నలయింపఁ దగదని తెలిపి వాని
నగుపడఁగఁ జేయరే కొమ్మనఁటులార. 61

వ. అని మఱియును జంగమేశ్వరుంగురించి యిట్లనియె. 62

ఉ. ఏలర యింతవింతచలమేలర నన్ను మనోభవానల
జ్వాలలవేఁడిమిం బొగలఁ జాలర లేజవరాలరా మదిం
జాల దిగు ల్దగుల్కొనియె జాలముసేయక వేగవచ్చి నా
వ్రాలఁగనంబడం గదర ముద్దులజంగమరాయ మ్రొక్కెదన్.

ఉ. పొంగుచునీముఖాంబుజము ప్రొద్దునఁజూచినవేళ యెట్టిదో
యంగజుఁడెంతయుం గుపితుఁడై వెనుదీయక యేఁచఁజొచ్చిన
న్నంగవలం గలంచి యిటురా రెదఁబెట్టెదవేల చాల నీ
సంగతిఁ గోరుకొంటిఁగద జంగమరాయ విలాసభాసురా. 64

తే. అనుచు వనమెల్లఁ ద్రిమ్మరి యందు నెచట
జంగమస్వామిఁ గానక గంగ యలసి
చాల నొప్పారుబాలరసాలసాల
మూలమునఁ గొంగుపఱచి కన్మూసియుండె. 65

క. మరుఁ డపు డిందీవరసర
సీరుహసితోత్పలామ్రశితవిశిఖంబుల్
పోరిఁబోరి వెసవింటఁ దొడిగి
కరిగామినిఁ బింజెపింజె గాఁడఁగ నేసెన్. 66

క. అటువేసిన హా యని య
క్కుటిలాలక సోలి తెలిసి కుసుమాస్త్రనిశా
విటమధుకరహంసకుహూ
రటమలయానిలులఁ గినుక ప్రబ్బఁగఁ బలికెన్. 67

తే. పార్వతీశంకరులమీఁదఁ బఱచి మున్ను
బన్నమందిన సుద్దిలోపలను మఱచి
యిప్పుడు నామీఁదఁ దొడిగెద విక్షుచాప
మింకనీవేమియయ్యెదో యెఱుఁగ రాదు. 63

క. సోమా నీవును నేనును
గామాంతకుశిరముమీఁదఁ గలసి మెలసి మున్
బ్రేమమున నుందు మిప్పుడు
నామీఁద న్వేఁడిచూప న్యాయమె నీకున్. 69

సీ. మదని శంభునికంటిమంట మ్రింగెడునాఁడు
తాఱి మీ రేచోక్క దూఱినారు
దర్పకుఁ డభవుచే దగ్ధుఁ డయ్యెడునాఁడు
తలఁగి మీ రేయెటఁ గలసినారు

వలరాజు హరునిచే నిలిగిపోయిననాఁడు
సురిగి మీ రేకోనఁ జొచ్చినారు
మదనుఁ డీశ్వరునిచే మడిసి పోయిననాఁడు
పారి మీ రేతిప్పఁ బట్టినారు
తే. వాఁడు గ్రమ్మర జీవించి వచ్చినపుడు
సిగ్గులే కిట్లు వెంబడిఁ జేరినారు
మధుపచక్రాంగపరభృతమలయపవను
లార గణుతింపఁదర మె మీరీర మిపుడు. 70

వ. అని యని వారితానంగసంతాపాటోపంబునం బొరలుచుండె
నంత. 71

తే. ఆత్మగృహమున నక్కడ ననుఁగుచెలులు
త్రుళ్లిపడి లేచి సెజ్జయు నెల్లచోట్లు
వెదకి గంగనుగానక వెఱఁగుమీఱ
వరుస నందఱు శృంగారవనము సొచ్చి. 72

సీ. కందర్పశరబాధఁ గుందుచు నందంద
శివశివా యని సద్దు సేయుదానిఁ
బొగలుచు గడితంపుబుడిబుడి వేఁడిక
న్నీటిజాల్ కొనగీర మీటుదాని
నెందు నల్కుడువిన్నఁ బొందుగాఁ జెవియొగ్గి
పొంచి నల్గడ లాలకించుదానిఁ
బొరిఁబొరి నిలమీఁద బొరలుచు లేచుచు
నుసురంచు నిట్టూర్పు లుచ్చుదానిఁ
తే. గమ్మకపురంపుబలుదుమారమ్ము చిమ్మి
క్రమ్ముకొని వీచువలినాతెమ్మెరలకు

నడలి యొడరార గడగడవడఁకుదానిఁ
జిన్నికన్నియఁ గాంచి రాచిగురుఁబోండ్లు. 73

తే. కాంచి మెల్లన దరి కరుదెంచి లోని
జడుపుదీరంగఁ బుష్పాడిఁ దడిసి వైచి
మెదవుగపురంపుబూఁది నెన్నుదుటఁ బెట్టి
యిందుబింబాననలు దాని కిట్టులనిరి. 74

ఉ. అమ్మకచెల్ల నీ విటుగయాళితనమ్మున మమ్ముఁ బిల్వకే
యుమ్మర మైనవేదలన మున్గుచు నీవడురేయిఁ గోనకుఁ
నెమ్మది నొంటి రాఁదగునె నీమదిలో వళుకేల లేదె హా
కొమ్మ వచింపఁ జిత్రము లగుంగద నీదుకడిందిచందముల్. 75

క. చిలుకలు గొరువంకలు గో
యిల లంచలు నెమలిగములు నెడపక యెపుడుఁ
గొలగొలలాడుచు విరహుల
నిలువఁగ నిచ్చునె వనంబు నీకుం గొఱయే. 76

తే. కొసరి యిట్టి పుష్పాడి కేలుగొనుచు నొక్క
యెడను గాలూనఁ గందదు బడి చరించు
జోగి జంగాల కిరవైనచోటు గదవె
పడఁతి యిఁక వానిపై నాస విడిచిరమ్ము. 77

తే. అమ్మ నీయింట సకలభాగ్యములు గలవు
దండ్రి యందఱిలో నెన్నఁదగినధనికుఁ
డింకఁ దగుచోటఁ గల్యాణ మెలమిఁ జేయు
వద్దురావమ్మ యింటికి బుద్ధి గలిగి. 78

వ. అని యూరడించి నెచ్చెలు లచ్చేడియ నింటికిం దోడ్కొని
తెచ్చి యిష్టగోష్ఠిప్రకారంబులఁ బ్రొద్దుగడపుచుండి రంత. 79

ఆ. వేగుఁజుక్క వొడిచె విడువక తామ్రచూ
డంబు లఱచె నిరులడంబు మాసెఁ
దూర్పు దెల్లవారెఁ దోయజమిత్త్రుండు
పొడవుగొండమీఁదఁ బొలుపుచూపె. 80

ఉ. అప్పుడు బోటినెచ్చెలులు హాళిని దాసకులాగ్రగణ్యుఁడై
యొప్పెడుశంఖదేవుకడ నొయ్యనఁ జేరి కుమారిచందముల్
దప్పక చొప్పడం దెలిపి తారట నేఁగిన నాతఁ డాత్మలో
ముప్పిరిగొన్న యంగదల మున్గుచు నేమియుఁ దోఁచకుం
డినన్. 81

తే. కొంతతడవు విచారించి కూఁతుఁ బిలువఁ
బంచి కూర్చుండ నిడి బుజ్జగించి యొడలు
దడవి ముద్దాడి కొండొకదడవునకుఁగు
మారికామణిఁ గాంచి ప్రేమమునఁ బలికె. 82

క. అమ్మా నీతలఁ పేమియు
సమ్మతి గాకున్న దిపుడు స్వాంతంబునకే
నిమ్మాట విని కలంగుచు
రమ్మని పిలిపించినాఁడ రయమున నిన్నున్. 83

తే. తల్లి నీ వేమిగోరినఁ దగిలి సేతుఁ
గాని యిక్కానిపని సేయఁ గాదు సుమ్ము
కోరి మఱి యొద్దియైనఁ గాంక్షింపఁ బోక
చిడిపిజంగమువానిఁ గాంక్షింపఁ దగునె. 84

క. కులమునఁ గలపెద్దలు విని
వెలిపెట్టినఁ గూడి పొత్తు విడనాడిన హా

తలవంపు లయ్యెడుం గద
చెలియా యీలాటిబుద్ధి చెల్లునె నీకున్. 85

క. కులమును రూపంబును గల
చెలువుని రప్పించి పెండ్లి సేసెద నీకున్
జలజాక్షీ గానిబుద్ధులు
వల దిఁక నామాట వినుము వాలాయముగన్. 86

వ. అనినం దండ్రికి గంగ యిట్లనియె. 87

ఉ. పొంగుచు మూఁడులోకములఁ బూనికతో విహరించి
పాపముల్, భంగ మొనర్చుచు న్భువనపావని నా విలసిల్లు
జాహ్నవీ, గంగను గాని నే మనుజకన్యను గాను నిజం
బతండునున్,జంగమవాఁడు గాఁడలభుజంగమరాజకలాపుఁ
డారయన్, 88

తే. తండ్రి యిమ్మాటఁ గొంతచిత్తమున నీ వె
ఱింగినది గాక యూరక ఱిచ్చపడక
యతనిరప్పించి వెస వివాహం బొనర్చ
నిఖలవాంఛాఫలంబులు నీకుఁ గలుగు. 89

క. ఇటువలెఁ గాకుండిన నా
నిటలాక్షునిపాద మాన నీయాన మఱేం
తటిబలవంతునినైనను
గటకట నే నింక నొరుని గాంక్షింపుదునే. 90

వ. అనిన సంతసిల్లి శంఖదేవుండు వెండియుఁ గూఁతున కిట్లనియె.

తే. అమ్మ యిమ్మాట నిక్కువం బయ్యె నేని
నతఁడు నిజమూర్తిఁ జూపించి యఖిలదివిజ

వర్గములఁగూడి యింటికి వచ్చెనేని
ప్రేమ దైవార నే నిన్నుఁ బెండ్లి సేతు. 92
క. విను మూరక నిన్నొసఁగిన
జనులందఱు నవ్వఁ గులముసాములు నన్నుం
గనుఁగొని యెగ్గులు వల్కరె
వనితా నీ వెఱుఁగనట్టివల నిఁకఁ గలదే. 93
ఆ. అనిన సంతసిల్లి యప్పుడు గంగాభ
వాని యభవు నాత్మలోనఁ దలఁచి
కరయుగంబు మోడ్చి స్థిరభక్తి దైవార
వినయసరణి నిట్టు లనుచుఁ బలికె. 94
సీ. సకలలోకారాధ్య సర్వజ్ఞ సర్వేశ
గిరిసుతాప్రాణేశ దురితనాశ
భూతభావన పరంజ్యోతిస్వరూప మ
హాదేవ శంకర హరమహేశ
జగదవనాధార నిగమాంతసంచార
ఫాలలోచన భర్గ నీలకంఠ
నందివాహన భృంగినాట్యప్రమోద గీ
ర్వాణసంస్తుత్య పురాణపురుష
తే. నాదబిందుకళామయ వేదవేద్య
చక్రధర బాణభక్తరక్షాధురీణ
నామనోనాథ కైలాసనగనివాస
వేడ్క నవధారు దేవ నావిన్నపంబు. 95
తే. దేవ మాతండ్రి యగుశంఖదేవుఁ డిపుడు
నాకు నీకును బెండ్లి యొనర్పఁ గోరి

తివురుచున్నాఁడు బ్రహ్మాదిదివిజవరులు
దవిలి గొలువంగ వేవేగఁ దరలిరమ్ము. 96

తే. నీకు నామీఁదఁ బ్రేమంబు నెరయఁ గల్గె
నేని నే నీకుఁ బ్రియురాలనేని యిపుడె
వేడ్కి దైవార జాలారివిభునిమ్రోల
నిలిచి నామాట సత్యంబు నెరపవయ్య. 97

వ. అని గంగ ప్రార్థింపుచున్న సమయంబున. 98

సీ. హరియు బ్రహ్మయుఁ బురందరముఖ్యదిక్పతుల్
గవిసుధాకరముఖగ్రహపతులును
సనకాదియోగికుంజరులు వశిష్ఠాత్రి
మైత్రావరుణిముఖ్యమౌనివరులు
వీరభద్రకుమారభైరవభృంగిరి
టాదిప్రమథనాథు లప్సరసలు
గరుడకిన్నరయక్షగంధర్వఖచరగు
హ్యక నాగసిద్ధవిద్యాధరులును

తే. బలసి కొలువంగ నసమవైభవముతోడ
నందికేశ్వరు నెక్కి యానందలీల
సకలలోకాధిపతి యైనసాంబశివుఁడు
దాసకులమౌళిమ్రోలఁ బ్రత్యక్షమయ్యె. 99

వ. అట్లు సాక్షాత్కరించిన దాక్షాయణీవల్లభుం బొడఁగాంచి పులకితాశేషావయవుండును, నిర్భరానందరసోత్ఫుల్లనేత్రుండును, విస్మయాకులస్వాంతుండును నగుచు దాసకులజ్యేష్ఠుండు సాష్టాంగదండప్రణామంబులు గావించి బహుప్రకారంబుల వినుతించి కృతాంజలి యై యిట్లనియె. 100

తే. అభవ నాభాగ్యమహిమ శక్యంబె పొగడ
హరిపురందరకమలాసనాదులకును
గనఁబడగరానినిన్ను నేఁ గంటి నిపుడు
పావనం బయ్యె నహహా నావంగడంబు. 101

తే. నీచకులయింటి కిప్పుడు నీవు వచ్చి
యొనరఁ గన్యార్థివై నిల్చియున్నవాఁడ
వే తెఱంగున నిన్ను సంప్రీతుఁ జేసి
యనుపఁ గలవాఁడనయ్య చంద్రోత్తమాంగ. 102

వ. అని విన్నవించి యొక్కదివ్యమణిమయమందిరంబున విడి
యించి, సకలబుధబాంధవామాత్యపురోహితసుహృజ్జనం
బుల రావించి, శుభముహూర్తంబు నిర్ణయించి, నిజగృహా
దికం బలంకరించి తదనంతరంబున. 103

సీ. శుభతూర్యనినదంబు లభినవస్థితి మ్రోయఁ
గరదీపికాసముత్కరము వెలుఁగ
ద్విజసతీమణులు ముత్తెపుసేసఁబ్రాల్ సల్ల
నుర్వీసురేంద్రు లాశీర్వదింప
గణికానికాయ మగ్గలికనృత్యం బాడ
వనజాతముఖులు నివాళు లొసఁగ
వందిమాగధులు కైవారంబు లొనరింప
గాయకుల్ గానవైకరులు నెరప

తే. మంగళద్రవ్యములఁ గొంచు మఱియుఁ బుణ్య
కాంత లరుదేర నత్యంతకౌతుకమున
సకలబుధబాంధవాశ్రితసహితుఁ డగుచు
భవు నెదుర్కొనెఁ గైవర్తపరిభృఢుండు. 104

వ. అప్పుడు మహాదేవుండు దివ్యదుందుభిధ్వానంబులును, గం
ధర్వకిన్నర గానంబులును, రంభోర్వశీప్రముఖాప్సరస్స
రోజాస్యాలాస్యావధానంబులును, జండీశ్వరప్రపఠితగద్య
పద్య విధానంబులును, దివిజర్షభప్రవర్షితదేవతరుప్రసూ
నంబులును, దేవవిమానంబులును, నిరంతరమహోత్సవ
లీలాముహూర్తవత్ప్రమథభటసంతానంబులును, బృందార
కసుందరీసందోహ పరివేష్టితచిత్రమణివితానంబులును, న
నూనంబులై చెలంగ నందికేశ్వరారూఢుండై, యభినవవై
భవంబున శంఖదేవునగరు బ్రవేశించి, యచ్చట వాహ
నంబు డిగ్గి, వివాహమంటపాభ్యంతరంబుసొచ్చి, సముచి
తపీఠాగ్రంబున సుఖాసీనుఁడై యున్న సమయంబున. 105

ఉ. అంగన లొక్కకొందఱు ప్రయత్నముతోడ నలంకరించియు
త్తుంగవివాహవేదికి వధూమణిఁ దోడ్కొని తెచ్చి వేడ్క ను
ప్పొంగుచునున్న యాచకులుభూసురముఖ్యులునప్పురాంతకున్
గంగను బెండ్లిపీట నిడి కంకణముల్ దగఁగట్టి రంతటన్. 106

తే. శంఖదేవుండు దేవతాసార్వభౌముఁ
డగుమహాదేవునకుఁ బ్రియం బలరఁ గాళ్లు
గడిగి తనముద్దుబిడ్డను గంగ నపుడు
ధారవోసె నిలింపబృందములు వొగడ. 107

వ. అప్పుడు. 108

సీ. సిరియును వాణియుఁ జెలఁగి సేసలఁ జల్ల
గురుఁ డొజ్జయై లగ్న మరసి తెలుప
హరియు బ్రహ్మయుఁ బెద్దలై పనుల్ సమకూర్ప
శ్రుతివాక్యములు వసిష్ఠుఁడు వచింప

శచియు నరుంధతీసతి నివాళు లొసంగ
రంభోర్వశులు వింత రవళి నాడఁ
దుంబురునారదుల్ దొడగి గానము సేయ
దేవదుందుభులు మేల్ తీవి మెఱయ

తే. హర్షమున విశ్వకర్త దా నంది యిచ్చు
కనకమంగళసూత్రంబు గంగయరుతఁ
గట్టి శుభ మొందె నసమానగరిమ మెఱయ
సకలభువనాధిపతి యైనశంకరుండు. 109

తే. హారునితలఁ గంగయు న
త్తరుణిశిరంబున హరుండు దమి మీఱఁగ వా
విరిము త్తెపుఁదలఁబ్రా లో
సిరి చిఱునగవులు దలిర్ప శివకరలీలఁ. 110

వ. అట్లు విధ్యుక్తప్రకారంబున వివాహం బొనరించి, కంకణ బంధంబు వెడలించి యున్నంత నొక్కనాఁ డొక్కశుభ ముహూర్తంబున. 111

సీ. ఘనసారహిమనీరగంధసారమసార
మృగనాభికామోద మేదురంబు
మణిమయపర్యంకమంజూషికాసాల
భంజికాపుంజవిభ్రాజితంబు
తపనీయముక్తావితానకళావికా
వ్యజనదర్పణచామరావృతంబు
కాలాగరుదశాంకకౌళికసామ్రాణి
కాధూపవాసనాగంధిలంబు

తే. వీటికావేటికాజాలవిలసితంబు
కజ్జలకరండమండలాఖండరత్న
దీపసంతానదీపితోద్దీపితంబు
నైనయొకకేళికాగృహాభ్యంతరమున. 112

క. మదనవిభంజనుఁ డతిస
మ్మదహృదయాంబురుహుఁ డగుచు మహిలామణికై
యెదురెదురు చూచుచుండఁగ
మదవతు లొకకొంద రపు డమందప్రేమన్. 113

తే. బాలికామణిఁ గైసేసి పడకటింటి
కెలమితోఁ దోడుకొని చని యిందుమౌళి
యొద్దఁ గదియించి తమ్ములం బొసఁగఁజేసి
చనిరి సన్నకసన్న నాశంభుఁ డపుడు. 114

తే. చిగురుఁబోఁడిని సెజ్జకుఁ దిగిచి బుజ్జ
గించి కౌఁగిటఁ బెనచి కోర్కెలు దలిర్పఁ
గామశాస్త్రోక్తనియతి నక్కంజముఖిని
రతులఁ గరఁగించి సుఖలీలఁ గ్రాలుచుండె. 115

వ. అట్లు నవోఢాసంగమ సౌఖ్యానుభవ లీలావైభవంబునం
జెలంగుచుఁ, గొన్ని వాసరంబు లచటనుండి, యంతట
నొక్కనాఁడు యథాస్థానంబునకు వేంచేయ నుద్యోగించి
మహాదేవుండు శంఖదేవున కత్తెఱం గెఱింగించిన నతం
డిట్లని విన్నవించె. 116

క. దేవా నాకులమెల్లను
బావనమై వెలసె భక్తపాలన విద్యా

ప్రావీణ్యం బేర్పడఁగా
నీ విచ్చటి కరుగుదెంచి నిలుచుటకతనన్. 117

క. దేవ మాయింట నెప్పుడు నీవు నిలిచి
యుండవలె ననుకోర్కె లో నుండునాకు
వెఱతు నిమ్మాట మీతోడ విన్నవింప
నింక మీచిత్త మెట్టిదో యెఱుఁగనేర. 118

క. మా కిట నీ వల్లుఁడవై
ప్రాకటగతి నిలిచియున్న భాగ్యంబునకున్
లోకు లెఱుంగఁగ నన్నుం
జేకొని ధన్యునిగఁజేయు సితకరమకుటా. 119

ఆ. అనిన మెచ్చి శంభుఁ డటులేనిదివ్యజ
లాపహారలింగరూపి నగుచు
నీగృహమున నుందు నిశ్చలభక్తితో
నన్ను గొలుచుచుండు నయవిచార. 120

వ. అని యతండు గోరినట్లనె కృపఁజేసి మన్నించి యతని న
చ్చట నుండ నియమించి మహోత్సాహంబున. 121

తే. అభవుఁ డప్పుడు దివ్యదుందుభులు మెఱయఁ
బ్రమథవరులును దివిజులు బలసికొలువ
గంగతోఁగూడి వృషరాజగమనుఁ డగుచు
లీల వేంచేసెఁ గైలాసశైలమునకు. 122

ఉ. అంతకమున్న నారదమహామునివర్యుఁడు వెండికొండ కే
కాంతముగాఁగ నేఁగి గిరికన్యక గన్గొని యంబ శూలి దా
సంతసమొప్ప గంగ యనుజాలరికన్నియఁ బెండ్లియాడి నీ
చెంతకు వచ్చుచుండె నిదె చెప్పితి నీకు సవిస్తరంబుగన్.

క. అని దివిజమునివరేణ్యుఁడు
వినిపించి యథేచ్ఛ జనిన విస్మయ మొదవన్
మనమున హిమవద్భూధర
తనయ దిగుల్ పూని తద్దఁ దలఁకుచు నుండెన్. 124

సీ. అంతట శంకరుఁ డఖిలామరుల యథా
స్థానంబులకుఁ బంచి సరభసముగ
గౌరికి వెఱచి యాగంగను జడలలో
నిడుకొని నగరున కేఁగుటయును
గొరకొరతోడ నక్కుధరేంద్రనందన
తలుపులు బంధించి చల మెలర్ప
మీనాంకదమనుని లోనికి రాకుండ
నతికఠినోక్తుల నాడుచున్న

తే. మదిఁ గలంగి పురారి యమ్మధురవాణి
కిట్టు లని పల్కె నహహా నీ కిట్టికినుక
యేల నామీఁదఁ బొడమె నే నేమితప్పు
నేసితి వచింపఁగదవె నాచెంత నిపుడు. 125

క. భక్తపరాధీనుఁడ నే
భక్తుల నరయంగఁ గోరి ప్రతిదివసము నా
సక్తిని దిరుగుచు నుండుదు
వ్యక్తావ్యక్తుండ నగుచు వనజాతముఖీ. 126

వ. కావున నాకుం దప్పుగా విచారించికవాటబంధనం బొనరించు
టుచితంబె యనిన నతనికి భవాని యిట్లనియె. 127

తే ఎచటి కేగితి విందాఁక నెచట నుంటి
వెవ్వడవు నీవు నీతెఱం గేనెఱుంగఁ

గ్రొత్తపెండిలికొడుకులాగునఁ గడింది
సొగసు గైకొనియున్నావు చూడ నిపుడు. 128

తే. తివిరి కామాంధకారివై తిరుగుప్రోడ
వేమి నీజాడ యింతయు నెఱుఁగరాదు
తెలియఁజెప్పు మటన్న నద్దేవితోడ
నిందురేఖాశిఖామణి యిట్టులనియె. 129

క. పర్వేందువదన విను మే
సర్వజ్ఞుఁడ నహహా మేలు సర్వజ్ఞునిపై
నుర్విని జను లెవ్వారు న
ఖర్వమతిం దలఁగి పోరుగద పరికింపన్. 130

తే. నీలకంఠుండ నే హరినీలవేణి
నీచెలిమిఁ గోరుకొని వచ్చి నిలిచినాఁడ
నౌర మేల్నీలకంఠుఁడ వైతివేని
కేక లిడుకొంచు వేగంబె గిరికిఁ జనుము. 131

క. క్రీడాకిరాతుఁడను నేఁ
జేడియ యటులైన నీవు జింకలు పులులుం
గ్రోడంబులు గలయడవికిఁ
బోడిమితో వేఁటలాడఁ బొమ్మా నెమ్మిన్. 132

సీ. అబల నేఁ బశుపతి నహహా నీ వట్లైన
నాలమందకు అంకె లడరఁ జనుము
స్థాణుఁడ నేను గంజాతాక్షి యబ్బబ్బ
మోడు మాటాడుట చూడ మెందుఁ
బురసంహారుఁడ నేను బోలఁతి నీ వట్లైన
మావీట నుండక మరలి పొమ్ము

పన్నగధరుఁడను బడఁతి నేనట్లైనఁ
బడిగ లెత్తుచు నూర్జిఁ బడి తిరుగుము

తే భూతనాథుఁడ నేను బూఁబోఁడియట్టు
లేని నలప్రేతభూములఁ కేగు మిపుడె
కుటిలకుంతల నే మహానటుఁడ నట్టు
లైనఁ బ్రభువుల కడ కేఁగి యాడు మెలమి. 133

క. చిగురాకుఁబోఁడి విను మే
నగవాసుఁడ నట్టు లౌదవినఁ దెక్కలతో
గగనమున కెగిసి చెట్లకు
జగతస్థితి నిలువఁబోక చనుమా వేగన్. 134

తే. విను విరూపాక్షుఁ డను నేను వనజవదన
యహహా బుధులు విరూపాక్షుఁడైన వానిఁ
జూడరా దని తఱుచుగ నాడుచుందు
రోలఁగి వేంచేయు మిఁకఁ బెక్కుపలుకు లేల. 135

తే. అనుచుఁ దా నాడుమాటలకగతనూజ
పాసఁగఁ గల్పించి యుత్తరం బొసఁగుటయును
దలఁకి యాపూర్ణనీహారధామముఖికిఁ
గాలకంఠుండు నమ్మికగా వచించె. 136

తే. తెఱవ నే నేమిపాపంబు నెఱుఁగ నీవు
వట్టితప్పులు నామీఁదఁ గట్టి యిట్లు
గలఁక నొందింపనేల యాగ్రహము మాని
వినుము నామాట యొక్కటి వీనులలర. 137

. ననఁబోఁడి నామాట నమ్మకుండితి వేనిఁ
జెనకి బెబ్బులివాఁతఁ జెయ్యిడియెద

గట్టిగాఁ బెనుబాముఁ బట్టి యాడించెద
విషమైన మ్రింగెద వెఱపులేక
కొదుగక వడిఁ బెద్ద గుడి సొచ్చి నిలిచెద
నవవీల గోపదం బంటుకొనెద
నంకిలి లేకుండ నగ్గి ధరించెదఁ
బట్టుగా ద్విజరాజు ముట్టుకొనెద
తే. మఱియు నేబాసయైన నేమమునఁ జేతుఁ
గాన నింక నీతలంపులో మాని మాని
నీశిరోమణి నన్ను మన్నింపు మిప్డు
డెలిమితోడుతఁ గదియించి యేలుకొనుము. 138

తే. అనిన నంబిక యొక్కింత యాత్మ నలరి
యారశ నీ కిట్టిబాసలు నచ్చివచ్చుఁ
బలుకు లేటికి రమ్మని తలుపుదీసి
పిలుచుటయు నేఁగి యతఁ డొద్ద నిలుచుటయును. 139

తే. అతనిసంభోగచిహ్నంబు లరసి చూచి
పార్వతీదేవి యిట్లనిపల్కె నహహ
యిప్పుడే నేమిసాపంబు నెఱుఁగనంటి
వెచటి వీచిన్నెలో నాకు నెఱుఁగఁజెప్పుము. 140

క. పసుపును గుంకుమగంధము
నసవంబక నీదుమేన నట్టువదలి యే
బిసరుహముఖి యంటించెనొ
కసరక నాతోడ నిపుడు గట్టిగఁ జెప్పుమా. 141

వ. అనిన భవుం డిట్లనియె. 142

క. విను మానిని జనులందఱు
వెనుకయ్యను బూజసేయ వెస నాతఁడు నన్
బెనఁగి కవుంగిటఁ బొదవినఁ
దనువున నవి యంటుకొనియెఁ దప్పే నాకున్. 143

తే. కాలకంధర నీమోవిగంటు లేమి
కారణంబునఁ బొదవె నా గౌరి వినుము
మరునితోడ నెదిర్చి సంగర మొనర్చు
తఱిని గోపించి కీరంబు గఱచెఁ జుమ్ము. 144

క. హాటకగిరిధర నీమెయిఁ
గాటుక యంటిన దదేమికారణ మబలా
కాటుక కాదిక లత్తుక
గాటపుగరళప్రభావికాసము సుమ్మీ. 145

క. మే లెంతటినెఱజాణవొ
బాళిగ దత్తురములాడి వంచించెదవో
బాలేందజూట నీమెయిఁ
బూ లంటుకయున్న వేల పొంకక చెప్పుమా. 146

తే. భామ విను మున్ను శ్వేతుఁ డన్భక్తవరుఁడు
వెలవెలందికిఁ బూల్గొంచు వెడలు నెడల
గొన్ని మహిమీఁద వ్రాలినఁ గోరి వాఁడు
నాకు నర్పింప నవి యంటి నాటుకొనియె. 147

క. పన్నగరాజాంగద నీ
కన్నుల కెఱుపేలగలిగె గౌరీభక్తుల్
ని న్నర్ధరాత్రివఱకు
నన్ను జ్జాగరణ మునిచినం బొసఁగె నిటుల్. 148

తే. అంచు నిరుపురు నిట్లు భాషించుతఱిని
నీలకంఠుండు మోహంబు నిలుపలేక
సర్వమంగళచరణకంజములమీఁద
వ్రాలెన న్నుద్ధరింపవే వనిత యనుచు. 149

క. వ్రాలినఁ గనుఁగొని గిరిసుత
మేలహహా జాణ వగుదు మెచ్చితి నిన్నుం
లే లె మ్మనుచుఁ గవుంగిటఁ
గీలించి విభునిమనోజకేళిం దేర్చెన్. 150

వ. అట్లుమామహేశ్వరు లన్యోన్యానురాగంబు లినుమడింప నఖండమహావైభవంబునఁ బ్రమోదింపుచుండి యొక్క నాఁడు. 151

క. వేడబ మొప్పఁగ నెత్తం
బాడుచు నున్నంత గిరిజయాటకు లోనై
యోడి శివుఁ డూరకుండినఁ
గ్రీడామోదమున గౌరి కిలకిల నవ్వెన్. 152

వ. అప్పు డమ్మహాదేవి యౌద్ధత్యంబు సహింపలేక శివజటాగ్రంబున గంగ తొంగిచూచిన దానిం గనుంగొని భవాని శంకరుని మొగంబు చూచి యిట్లనియె. 153

తే. ఏమిపాపం బొకింత నే నెఱుఁగనంటి
వహహా నీకెంజడలలోన నడఁగి తొంగి
తొంగి చూచుచు నున్న దేధూర్తసతియొ
దానిచందంబు తెలుపుమా తడయ కిపుడు. 154

క. మును దారుకాననంబున
మునిదారలభ్రమలఁ బెట్టి మోహింపఁగఁ జే
సినమేటివన్నెకాఁడవు
నినుఁ జెప్పఁగనేల యింక నేఁడు వృషాంకా. 155

క. భల్లాణరాజుకూరిమి
యిల్లాలై కడిఁదిహాయుల నింపొందినయా
చెల్లాంబం గామించిన
బల్లిదుఁడవు నీహారంగు పలుకం దరమే 156

తే. సురలు నసురులు నమృతంబు నరుదుకొనఁగ
లేక పోరాడుచోఁ జక్రిలీల నొక్క
నెలఁతయై పంచి యిడుచున్న నీవుదాని
వెంటఁబడి పర్వు లెత్తవె వేడబముగ. 157

వ. అని మఱియు నిట్లనియె. 158

ఉ. అక్కట నీవు నన్నిటుల నారడిఁబెట్టి కలంపఁ జూచుటల్
నిక్కముగా మదిం దెలియనేరక యూరక మోసపోతి నిం
కెక్కడిసత్యశౌచములు హీనకులంబువెలందిఁ బెండ్లియై
డక్కగ నెత్తిఁబెట్టుకొని టక్కులు వల్కెద వేమిచెప్పుదుర్.

తే. తివిరి నామీఁద నొక్కతె దెచ్చి యిపుడు
లేదు లేదని బొంకువల్కెద వయారె
దానిఁ గ్రిందికి దించి నాదఱిని నిల్పి
మాటలాడించుమా యింక మరుగులేల. 160

క. తగులమి రెుుకచోఁ దక్కరి
వగ లొకచోఁ బెరయఁ జెలులు వంచింతురు గ

ట్టిగ నెట్టిబాసచేసిన
మగవారిని నమ్మరాదు మాట లిఁకేలా. 161

వ. అని పలుకుచున్నసమయంబున. 162

క. నిగిడెద కొరకొరతోడఁ గ
మొగ మించుక చేవ్రరింపఁ బోణిమి నబ్రం
బుగ నగభవనునిగడితఁపు
సిగలోపలనుండి గంగ చివ్వున నుతికెఁ. 163

వ. అప్పుడు భవాని దానిం గనుంగొని యిట్లనియె. 164

క. ఎక్కడిదానవె నీ విటు
లక్కజముగ నాహృదీశునౌఁదలపైఁ బెం
పెక్కఁగ వసించి యిప్పుడు
చిక్కిన నుతికితివి బుద్ధి సెప్పెదఁ జుమ్మీ. 165

క. నీ వెక్కడ నే నెక్కడ
భావజహరుఁ డెచట నోసి పరఁగంగ నిఁకఁ
గావర ముడిగి తటాలున
వేవేగ మదాలయంబు వెలువడి పొమ్మా. 166

క. పోకుంటివేని నిన్నుఁ
రాకాసులవంటిప్రమథరాజోత్తములఁ
దీకొలిపి ప్రోలు వెడలఁగ
నూకింతుఁజుమీ చలంబు నూలుకొనంగఁ. 167

వ. అనినం బార్వతీదేవికి భాగీరథి యిట్లనియె. 168

తే. అక్కరో యిట్టిమాటల నాడనేల
నీవు శంభునిఁ గోరి మున్నేవిధమున

వచ్చి చేకొనియున్నావో వాలెముగను
నేను నటువలె వచ్చినదానఁ జువ్వె. 169

క. చిగురాకుఁబోండ్లకెల్లను
మగఁ డేమారగను మేటిమక్కువతోడన్
సగమేన నిల్పుకొన్నను
సిగలో నిడుకొన్నఁ జెల్లుఁగదమ్మా. 170

వ. అనిన భవాని దాని కిట్లనియె. 171

క. మే లహహా యెంతటిగ
య్యాళివె చేరినటులుండ కఱచెదవు కదుం
గూలికి వచ్చినయాతఁడు
పాలికిఁ బట్టినక్రియ న్విపర్యాసముగన్. 172

ఆ. అడుగునిలుపనీక వడికొట్టుచూపుచు
నింగిముట్టి మిగులఁ బొంగెదేమి
గట్టివాతనంబు గనఁబడనౌనె నీ
నిలువు నీరుగాను నీచురాల. 173

వ. అనిన గంగ యిట్లనియె. 174

ఆ. పెద్దదాన ననుచుఁ బెళపెళనార్చుచు
జగము లెల్ల మ్రింగఁజాలునట్టి
సత్తిరూపు పూని జడిపింపవచ్చెదు
కినుక నిగుడ నీవుగిరితనూజ. 175

వ. అనిన హైమవతి యిట్లనియె. 176

తే. నిచ్చనిచ్చలుఁ బంకంబు నివ్వటిల్లఁ
గోరి మితిలేనిజలచరకోట్లలోన

నడచుకొనియుండు చెనటు వయారె నీవు
నన్ను నెదిరింప నెట్టిదానవె తుటారి. 177

ఆ. వక్రగతులచేత వాలెంబుఁ బెక్కుత్రో
వల వెలుంగుచుండి కలఁక నిగుడఁ
దూఱి మొరసెదేమి దుష్కీర్తి బోఁడవి నీ
బ్రతుకు బైలుగాను పలువదాన. 178

క. అనిన జ్జాహ్నవి గిరిసుతఁ
గనుఁగొని యిట్లనియె నీవు ఘనురాలవె మేల్
మునుచండికవై యొక కా
ఱెనుపోతును జంపి దానిహితమతిఁ గొనవే. 179

తే. సకియ యూరూర దేశదేశములఁ బెద్ద
సత్తివై నిల్చి కూళ్లను శాకములను
గోళ్లు గొరియలు గుగ్గిళ్లు కుడుము లట్లు
దనివిసన మెక్కుకడుపుబద్దరివి గదవె. 180

వ. అనిన నంబిక యిట్లనియె. 181

తే ఓసి గయ్యాళి నీ కింతరోస మేల
చెడుగుజాలారి వానింటఁ బోఁడమి బిట్టు
చేఁప జెల్లలు దిని మేను చెందకున్న
పరికెతవు నీవు నాతోడ సరియె చెపుమ. 182

వ. అనిన భాగీరథి యిట్లనియె. 183

తే అప్పరో యింక నీగుట్టు చెప్పనేల
కల్లు గంజాయి నంజుడు నెల్లప్రొద్దు

బాళిగాఁ దిను కడజాతివానియింటఁ
బుట్టితివా లేదొ చెప్పుమా గట్టిగాను. 184

వ. అని యిత్తెఱంగున నిరువురు వాదింపుచున్న సమయంబునఁ గాత్యాయనీదేవి మహాదేవుని మొగంబు సూచి యిట్లనియె. 185

తే. అకట నామీఁద నీవిపు డోకతెఁదెచ్చి
వాద మొదవించి యెఱుఁగనివానిఁబోలెఁ
జూచుచున్నాఁడ వింకనీచొప్పు దెలిసె
నంచుఁగోపించి చనుచున్న నళికి హరుఁడు. 186

తే. వనితపదపద్మ ములమీఁద వ్రాలి నేను
దప్పుసేసితి లోఁగొమ్ము దయ దలిర్ప
నిందుముఖి యింక నెలఁతుక లెందరున్న
నీవు పట్టంపుదేవివిగావె చెపుమ. 187

వ. అని బుజ్జగించి గాఢాలింగనంబు గావించి గంగచేత భవానికి మ్రొక్కించి వారిద్దఱిం గనుంగొని యిట్లనియె. 188

ఆ. ఒక్కచోటఁ బుట్టి యొక్కనిఁజెంది మీ
లోన మీకు వైరమూని యిట్లు
పోరొనర్పనేల పొలఁతుకలార మీ
రొద్దిమీఱఁ గూడియుండుఁ డింక. 189

క. అని నగసుత నర్ధాంగం
బున జాహ్నవి నుత్తమాంగమున నిడి కమలా
సనముఖ్యులు గొలువఁగ శివుఁ
డెనయొదవనితీవి జగము లేలుచు నుండెన్. 190

సీ. గడితంపుముప్పన్నె కడిఁదిదుప్పటియును
బసమీఱుబంగారువట్టుచేల
రుచిరాభినవచారురుద్రాక్షమాలికల్
మురువైనసహజంపుమంజిముత్తెసరులు
భువనాభిరామవిభూత్యంగరాగంబు
సారకాశ్మీరపటీరచర్చ
భూరిశోభాకీర్ణభుజగభూషణములు
మణిమయతపనీయమండనములు

తే. పాండురారుణవర్ణవిభ్రాజమాన
గాత్రమును గల్గి శృంగారగరిమ నలరు
నర్ధనారీశ్వరేశ్వరుఁ డభవుఁ డిందు
మౌళిభక్తాళినయనంబు మనుచుచుండు. 191

తే. అనుచు భీష్ముండు పాండుపుత్త్రునకు గంగ
కథ యెఱింగింప నలరి యాపృథుబలుండు
నిటలలోచనుఁ దలఁపున నిలిపి మ్రొక్కి
యతితరామోదహృదయుఁడై యలరుచుండె. 192

తే. శాలివాహనశకవర్ష సంఖ్యవసున
వాంగశశిసంజ్ఞ నలరుధాతాబ్దమునను
దగ రచించినయీకృతి ధరణియందు
నాసుధాకరతారార్క మగుచు నుండు. 193

క. వినుఁ డీకృతి ముప్పదియొక
దినములకుం జెప్పినాఁడ దేవునియానన్

జను లెన్నఁ గుక్కుటేశ్వరు
ఘనకరుణాదృష్టివలనఁ గవివరులారా. 194

క. ఈకథ చదివిన వ్రాసిన
బ్రాకటముగ విన్న జనులపాపము లడఁగుౕ
జేకురు సకలసుఖంబులు
శ్రీకంఠునికరుణచేత సిద్ధముగాఁగ౯. 195

ఆశ్వాసాంతము.

చ. అరిబలదర్పశోషణ మహాహివిభూషణ సత్యభాషణా
సరసకృపానిరీక్షణ విచక్షణరక్షణ పుణ్యలక్షణా
హరిముఖనిర్జరావన విషాగ్నినిషేవన విశ్వభావనా
సరసిరుహాక్షసాయక లసత్ఫలదాయక లోకనాయకా. 196

తోటకవృత్తము.—

శివశంకరశాశ్వతశిష్టరతా
భవభర్గసమాశ్రితభక్తహితా
దివిషజ్జనసేవిత ధీమహితా
వివిధాగమవందిత విశ్వనుతా. 197

మాలినీవృత్తము —

ప్రముదితమునిజాలా భక్తలోకానుపాలా
శమసమదవిభంగా చారుగంగోత్తమాంగా
ప్రమథగణసనాథా పార్వతీప్రాణనాథా
కుముదహితకలాపా కుక్కుటాధీశరూపా. 108

గద్యము. ఇది శ్రీమత్కుక్కుటేశ్వర కరుణాకటాక్ష నిరీక్షణ సంలబ్ధ సరసకవితా సామ్రాజ్యధురంధర, ఘనయశో బంధుర, కౌండిన్యసగోత్రపవిత్ర, కూచిమంచి గంగనామాత్యపుత్ర, సకల సంస్కృతాంధ్రలక్షణకళాకౌశలాభిరామ తిమ్మకవి సార్వభౌమ ప్రణీతంబైన శివలీలావిలాసంబను శృంగారరస ప్రబంధంబునందు సర్వంబును ద్వితీయాశ్వాసము.

శివలీలావిలాసము సమాప్తము.

చెన్నపురి: వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారి.
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1930.

ఆంధ్ర గ్రంథములు.

పద్యకావ్యము.

	ప్రతి 1-కి	రూ.	అ.
అచ్చ తెనుగురామాయణము, శుద్ధప్రతి	...	1	4
డిటో కాలికోబైండు	...	1	10
అడవిమల్లెలు, ఎనమండ్ర నారాయణమూర్తి గారివి	...	0	8
అధ్యాత్మరామాయణము, కొత్తకూర్పు	...	1	8
అనంతునిఛందము, ఛందోదర్పణము	...	0	14
అనిరుద్ధచరిత్రము, కనుపర్తి అబ్బయామాత్యప్రణీతము	...	0	8
డిటో కాలికోబైండు	...	0	14
అప్పకవీయము, శ్రీగిడుగు రామమూర్తి పంతులుగారి విమర్శతో నున్నది.	...	2	8
అంబరీషోపాఖ్యానము, సటీక (భాగవతము)	...	0	4
ఆంజనేయదండకము, హనుమద్దండకము	...	0	2
ఆంధ్రభాగవతము, పోతనామాత్యప్రణీతము, ఇదివఱకు ముద్రితమైన ప్రతులకన్న అన్నివిధముల బాగుగనున్నది	...	5	8
డిటో అత్యుత్తమప్రతి, రెండుసంపుటములు	...	7	8
డిటో 3 సంపుటములు	...	9	0
శ్రీమదాంధ్రభారతము-పద్యకావ్యము:—			
7 సంపుటముల ప్రతి	...	14	0
3 సంపుటముల ప్రతి	...	13	0
ఆది, సభాపర్వములుగల సంపుటము	...	2	0
అరణ్యపర్వము ,,	...	2	0
విరాటోద్యోగపర్వములు ,,	...	2	0
భీష్మద్రోణపర్వములు ,,	...	2	0
కర్ణశల్యసౌప్తిక స్త్రీపర్వములు	...	2	0
శాంతిపర్వము	...	2	0

అనుశాసనిక, అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణపర్వములుగల సంపుటము	...	2	0
ఆదిపంచకము, ఒకటేసంపుటము	...	5	8
యుద్ధపంచకము స్త్రీపర్వము	...	3	12
శాంతిసప్తకము	...	3	12
ఆదిపర్వముమాత్రము, పెద్దచ్చు, చిన్నసైజు	...	1	8
ఆంధ్రభారతము, ఉద్యోగపర్వము	...	0	8
ఆంధ్రభారతవిమర్శనము, మల్లాదిసూర్యనారాయణశాస్త్రి	...	0	8
ఆనందరంగరాట్ఛందము, కాలికోబైండు	...	1	8
ఆంధ్రబ్రహ్మాండపురాణము	...	5	0
ఆంధ్రలలితోపాఖ్యానము	...	1	8
ఆంధ్రశ్రీమద్రామాయణము, కావ్యస్మృతితీర్థ జనమంచి శేషాద్రిశర్మ కృతము, 3 సంపుటములు	...	12	0
డిటో 7 సంపుటములు	...	14	0
ఆంధ్రభాషాభూషణము	...	0	2
ఆంధ్రనామసంగ్రహము, ఆంధ్రనామశేషము, సాంబనిఘంటువు, టీకానుక్రమణికాసహితము	...	0	12
,, కాలికోబైండు	...	1	0
ఆంధ్రచంద్రాలోకము, సటీక	...	0	8
ఆంధ్రశబ్దచింతామణి, సటీక	...	0	8
ఉత్తరరామాయణము, కంకంటి పాపరాజప్రణీతము, చక్కనికూర్పు గిల్టుబైండు	...	2	0
ఉత్తరహరివంశము, నాచనసోమనాథకృతము	...	1	8
కవిసంశయవిచ్ఛేదము, అడిదము సూరకవిది	...	0	6
కవికర్ణరసాయనము (మాంధాతచరిత్ర)	...	1	8
డిటో మేలుప్రతి, కాలికోబైండు	...	1	14
కవిజనాశ్రయము, భీమునిఛందస్సు	...	0	12
కళాపూర్ణోదయము, దళసరికాగితములు	...	2	4

		ప్రతి 1-కి రూ.	అ.
కాశీఖండము, చక్కనికూర్పు	...	1	8
డిటో కాలికోబైండు	...	1	12
కుచేలోపాఖ్యానము సటీక, (భాగవతము)	...	0	4
డిటో గట్టుప్రభుకృతము	...	0	6
కృష్ణరాయవిజయము, కుమార ధూర్జటికృతము	...	0	8
గజేంద్రమోక్షము, సటీక, చక్కనికూర్పు	...	0	6
డిటో కాలికోబైండు	...	0	8
గద్యపద్యసంగ్రహము, జనమంచి వేంకటసుబ్రహ్మణ్యశర్మగారిచే సమకూర్పబడినది	...	0	10
డిటో గోత్రి సూర్యనారాయణశాస్త్రిగారిది	...	0	12
గరుడాచలము, యక్షగానము, పెద్దచ్చు	...	0	2
గోపీనాథరామాయణము, 2 సంపుటములు, శ్రీమద్రామాయణమునకు సరియైనపద్యము. కవనము మిక్కిలిసొంపు; పీఠిక అతివిపులము.		7	8
చంద్రరేఖావిలాపము, కూచిమంచి జగ్గకవిది	...	0	14
చాటుపద్యమణిమంజరి, క్రొత్తకూర్పు, ప్రథమభాగము	...	1	4
డిటో రెండవభాగము, సాధారణప్రతి	...	1	6
డిటో మేలుప్రతి, గ్లేజు కాగితములది	...	1	10
చెన్నబసవపురాణము, పావకవికృతము	...	1	2
ఛందోదర్పణము, (అనంతునిఛందము)	...	0	14
జైమినిభారతము, అశ్వమేధపర్వము	...	1	0
డిటో కాలికోబైండు	...	1	6
దశకుమారచరిత్రము, పద్యకావ్యము, కేతనకవికృతము	...	1	8
డిటో కాలికోబైండు	...	1	12
దశావతారచరిత్ర, చక్కనికూర్పు	...	2	0
దసరాపద్యములు	...	0	1
ధ్రువోపాఖ్యానము, సటీక, (భాగవతములోనిది)	...	0	8
నరసభూపాలీయము, అట్టబైండు	...	0	10
డిటో మేలుప్రతి, కాలికోబైండు	...	1	0

	ప్రతి 1-కి రూ.	అ.
నలోపాఖ్యానము, సటీక, చిన్నసైజు ...	0	6
తెనుఁగుసమస్యలు ...	0	2
నలచరిత్ర, ద్విపద ...	0	14
నిర్వచనోత్తరరామాయణము, మేలుప్రతి ...	1	0
నిరంకుశోపాఖ్యానము, రుద్రకవికృతము ...	0	6
నీతిపద్యసంగ్రహము, సటిప్పణము ...	0	4
నీలాసుందరీపరిణయము, కూచిమంచి తిమ్మకవికృతము ...	0	4
డిటో కాలికోబైండు ...	0	8
నృసింహపురాణము, ఎఱ్ఱాప్రగ్గడ, క్రొత్తకూర్పు ...	1	0
డిటో కాలికోబైండు ...	1	6
పంచతంత్రము, నారాయణకవికృతము ...	0	12
డిటో కాలికోబైండు ...	1	2
డిటో వేంకటనాథరాజకవికృతము ...	1	4
డిటో కాలికోబైండు ...	1	10
ప్రభావతీప్రద్యుమ్నము, క్రొత్తకూర్పు ...	0	10
డిటో కాలికోబైండు ...	0	14
పారిజాతాపహరణము, చిన్నసైజు క్రొత్తకూర్పు ...	0	8
బసవపురాణము, పిడుపర్తి సోమనాథప్రణీతము ...	2	4
బ్రహ్మోత్తరఖండము, శ్రీధరమల్లెవేంకటరామకవి ...	1	0
భోగినీదండకము, బమ్మెరపోతనకవి ...	0	1
భోజరాజీయము, అనంతామాత్యకృతము ...	1	2
మనుచరిత్ర, సటీక, వావిళ్లరామస్వామిశాస్త్రిగారి వ్యాఖ్యానముతో చిన్నసైజున మేలు కాకితములమీద స్ఫుటమైన అక్షరములతో చక్కఁగ ముద్రించియున్నారము. ...	2	0

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,

292, ఎస్ప్లనేడ్, చెన్నపురి. ఈ.

		రూ.	అ.
		ప్రతి 1-కి రూ.	అ.
లంకావిజయము, (రావణదమ్మీయము) సటీక, పిండిప్రోలు లక్ష్మణకవి కృతము	...	1	4
డిటో కాలికో బైండు	...	1	8
వసుచరిత్ర విమర్శనము, శ్రీ చినసీతారామస్వామి శాస్త్రి కృతము, అత్యద్భుతములగు క్రొత్తవిషయము లనేకము లిందుగలవు	...	1	0
వసుచరిత్ర, సటీక, రామరాజభూషణ ప్రణీతము అనేకనూతనాంశములుగల చక్కని క్రొత్తకూర్పు	...	4	0
వసిష్ఠజనకసంవాదము, యామిజాల శేషయ్యకవి	...	0	8
వాసిష్ఠరామాయణము, ద్విపద, తరిగొండ వెంకమ్మకవి	...	1	4
విక్రమార్కచరిత్ర, జక్కనకవి ప్రణీతము	...	1	4
డిటో కాలికో బైండు	...	1	10
విష్ణుపురాణము, వెన్నెలకంటి సూరన్న, క్రొత్తకూర్పు	...	2	8
విశ్వగుణాదర్శము, పాతప్రతి	...	0	8
విజయవిలాసము, చేమకూర వేంకటకవికృతము	...	0	8
డిటో కాలికో బైండు	...	0	12
విదురనీతి, సటీక, ఆంధ్రభారతములోనిది	...	0	5
విరాటపర్వము, పద్యకావ్యము, ప్రథమాశ్వాసము	...	0	8
డిటో ,, ద్వితీయాశ్వాసము	...	0	8
డిటో ,, తృతీయాశ్వాసము	...	0	12
వీరభద్రవిజయము, బమ్మెరపోతరాజకృతము	...	0	12
వేంకటాచలమాహాత్మ్యము, తరిగొండ వెంకమ్మ	...	1	0
వేంకటాచలమాహాత్మ్యము, కాలికోబైండు	...	1	6
వేమనపద్యములు, చక్కనికూర్పు	...	0	6
డిటో బ్రౌనుదొరగారి ఇంగ్లీషుతో	...	1	4
వేమనపద్యములు, 2728 పద్యములు, కాలికోబైండు	...	1	12
వేమనశతకము	...	0	2
శకుంతలాపరిణయము, కృష్ణకవికృతము	...	0	12
డిటో కాలికోబైండు	...	1	2

	ప్రతి 1-కి రూ.	అ.
వేమనపద్యములు, 2728 పద్యములు, తాత్పర్యసహితము, ఇందు గ్రంథ విమర్శ, కవిజీవితము మొదలగునవి చేర్పఁబడినవి. చక్కని క్రొత్తకూర్పు ...	3	8
వైశ్యపురాణము, శ్రీగురుభాస్కరాచార్యకృతము ...	1	4
శతకంఠరామాయణము, క్రొత్తకూర్పు, మల్లనకవికృతము ...	0	10
శశిరేఖాపరిణయము, అప్పప్పకవికృతము ...	0	12
డిటో కాలికోబైండు ...	1	2
శృంగారనైషధము, శ్రీనాథకవిది, క్రొత్తకూర్పు ...	1	0
,, కాలికోబైండు ...	1	6
శృంగారశాకుంతలము, పినవీరభద్రకవి ...	0	12
డిటో కాలికోబైండు ...	1	2
శేషధర్మము, పద్యము, తామరపల్లితిమ్మయ్య ...	0	12
సమీరకుమారవిజయము ...	1	4
సప్తమస్కంధము, సాధారణప్రతి, (భాగవతము) ...	0	6
డిటో టీకాతాత్పర్యసహితము, కాలికోబైండు ...	1	4
సహస్రకంఠరామాయణము, రామావధ్యుల కొండయ్యకవి...	0	12
సారంగధరచరిత్రము, చేమకూర వేంకటకవికృతము ...	0	8
సానందోపాఖ్యానము, శ్రీశివరామకవి విరచితము ...	1	0
సీతారామాంజనేయసంవాదము, సటీక, అనేక నూతనాంశములుచేర్చి చిన్నసైజున ముద్రించినారము. టీక, వివరణము మిక్కిలి విపులము. ఈవఱకు ప్రకటితమైన ప్రతులకన్న బాగుగనున్నది.		
మేలుకాగితములు, గిల్టుపేరు, కాలికోబైండు ...	3	8
సులక్షణసారము, సటీక ...	0	8
డిటో కాలికోబైండు ...	0	12

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,
292, ఎస్ప్లనేడ్, చెన్నపురి. ఈ.